بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ | نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ | وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

وَلَقَدۡ نَصَرَکُمُ اللّٰہُ بِبَدۡرٍ وَّاَنۡتُمۡ اَذِلَّۃٌ

# బదర్

(Telugu)వార పత్రిక ఖాదియాన్

Weekly **BADAR**
Qadian

సంపుటి: 11 | సంచిక: 24

www.akhbarbadr.in

సంపాదకులు: హాఫిజ్ సయ్యద్ రసూల్ నియాజ్,
ఉపసంపాదకులు: ముహమ్మద్ అక్బర్.

తేది: 11 జూన్ 2026 క్రీ, శ. 11 ఎహ్సాన్ 1405 హి, శ. 24- జుల్ హజ్ 1447 హి,ఖ.


## పవిత్ర ఖుర్ఆన్ బోధనలు

اِنَّ اللّٰہَ یَاۡمُرُ بِالۡعَدۡلِ وَالۡاِحۡسَانِ وَاِیۡتَآیِٔ ذِی الۡقُرۡبٰی وَیَنۡہٰی عَنِ الۡفَحۡشَآءِ وَالۡمُنۡکَرِ وَالۡبَغۡیِ ۚ یَعِظُکُمۡ لَعَلَّکُمۡ تَذَکَّرُوۡنَ ﴿۹۱﴾ (سورۃ النحل:91)

అనువాదం: నిశ్చయముగా అల్లాహ్ న్యాయము, మేలు బంధుమిత్రులకు చేయునట్లే సహాయము చేయవలెనని ఆదేశించును. సిగ్గుమాలిన, పనికి మాలిన మాటలు ఎదురు తిరుగుదనము నుండి ఆపుము. మీరు గుణపాఠము పొందవలెనని మీకు అతడు ఉపదేశించును. (అన్నహల్: 91)

## ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం హదీస్‌ల కోణంలో న్యాయం, ధర్మం.

హజ్రత్ ఆయిషా (రజియల్లాహు అన్హా) ఇలా వివరించారు: బను మఖ్జూమ్ తెగకు చెందిన ఒక మహిళ దొంగతనం చేసింది. ఈ సంఘటన వల్ల ఖురైష్ ప్రజలు చాలా ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం గురించి ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) గారితో ఎవరు మాట్లాడగలరని వారు ఆలోచించారు. చివరికి, ప్రవక్తకు అత్యంత ప్రియమైన సహాబీ అయిన ఉసామా బిన్ జైద్ (రజియల్లాహు అన్హు) మాత్రమే ఈ విషయంలో సిఫారసు చేయగలరని భావించారు. అందువల్ల వారు ఉసామా (రజి.)ను ఆ మహిళ తరపున మాట్లాడమని ఒప్పించారు. ఉసామా (రజి.) ఈ విషయాన్ని ప్రవక్త (స.అ.వ.) గారి ముందు ప్రస్తావించగా, వారు (స) తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తూ ఇలా అన్నారు:

**"అల్లాహ్ నిర్దేశించిన శిక్షల విషయంలో నీవు సిఫారసు చేయాలనుకుంటున్నావా?"**

ఆ తరువాత ప్రవక్త (స.అ.వ.) నిలబడి ఒక ప్రసంగం చేస్తూ ఇలా అన్నారు:

"మీకు ముందు ఉన్న ప్రజలు ఈ కారణంగానే నాశనం చేయబడ్డారు: వారిలో ఉన్నత స్థాయి, ప్రభావం కలిగిన వ్యక్తి దొంగతనం చేస్తే, అతడిని వివిధ కారణాలు చూపించి వదిలివేసేవారు. కానీ బలహీనుడు దొంగతనం చేస్తే, అతనిపై పూర్తి శిక్షను అమలు చేసేవారు.

అల్లాహ్ ప్రమాణంగా చెబుతున్నాను! ఒకవేళ ముహమ్మద్ (స)కుమార్తె ఫాతిమా కూడా దొంగతనం చేసినట్లయితే, ఆమె చేతిని కూడా నేను నరికించేవాడిని; ఆమెకు కూడా ఎలాంటి మినహాయింపు లేదా ప్రత్యేక రాయితీ ఇవ్వబడదు."

**( సహీహ్ ముస్లిం, కితాబుల్ హుదూద్ )**

## "ఇస్లాంలో న్యాయం, ధర్మము మరియు ఉపకారంనకు గల ప్రాధాన్యత "

**(ఉపదేశములు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం)**

మీరు న్యాయం , ఉపకారం మరియు బంధువులకు ఇవ్వడం వంటి వాటిని వాటి తగిన సమయాలలో ఆచరించమని అల్లాహ్ మీకు ఆజ్ఞాపిస్తున్నాడు. కాబట్టి ప్రపంచ వ్యవస్థను అనుసంధానించి, దృఢపరచే పరిపూర్ణత స్థాయితో పోలిస్తే ఇంజీల్ బోధన తక్కువ స్థాయిలో ఉందని గ్రహించాలి. ఆ బోధనను సంపూర్ణమైనదిగా భావించడం కూడా ఒక గొప్ప పొరపాటు. అలాంటి బోధన ఎప్పటికీ సంపూర్ణమైనదిగా ఉండదు. **(బరాహీన్-ఎ-అహ్మదీయ్యా, భాగం 4, రూహానీ ఖజాయిన్, సంపుటి 1, పుటలు 426--427, అనుబంధము నెం. 3)**

తనతోను, తన సృష్టితోను న్యాయంగా వ్యవహరించవలనని అల్లాహ్ మీకు ఆజ్ఞాపిస్తున్నాడు. అనగా అల్లాహ్‌కు సంబంధించిన హక్కులను, అతని దాసులకు సంబంధించిన హక్కులను నెరవేర్చాలి. మీరు దానికంటే ఎక్కువ స్థోమత కల్గియున్నచో, కేవలం న్యాయం మాత్రమే కాకుండా ఉపకారం (ఇహ్సాన్) కూడా చేయవలెను. అనగా, విధిగావించబడిన వాటికి అధికముగా, మీరు దేవుణ్ణి చూస్తున్నట్లుగా అత్యంత చిత్తశుద్ధితో ఆయనను ఆరాధించాలి; అలాగే ప్రజలతో వారి హక్కులకు మించి దయ, మర్యాద, సత్సంబంధాలతో వ్యవహరించవలెను. ఇంకా మీరు అంతకంటే ఉన్నత స్థాయికి చేరగలిగితే, ఎటువంటి స్వార్థం లేదా ప్రతిఫలాపేక్ష లేకుండా, సన్నిహిత బంధుత్వపు సహజ ప్రేమతో చేసే విధంగా దేవుణ్ణి ఆరాధించి, ఆయన సృష్టికి సేవ చేయాలి.

**(షహనే-హక్, రూహానీ ఖజాయిన్, సంపుటి 2, పుటలు 361--362)**

## న్యాయం, ఉపకారం, బంధువు మిత్రులతో సత్ప్రవర్తనతో వ్యవహరించడము సంపూర్ణ ఇస్లామీయ బోధనలకు నిదర్శనం.

హజ్రత్ ముస్లెహ్ మౌవూద్ (ర.అ.) ఇన్నల్లాహ యఅమురు బిల్ అద్‌లి వల్ ఇహ్‌సాని వ ఇతాఇజిల్ ఖుర్బా వ యన్‌హా అనిల్ ఫాషాహి వల్ మున్‌కరి బల్‌బఘీ య ఇజ్‌కుం లఅల్లకుం తజక్కరూన్ అనే సూక్తిని వివరిస్తూ ఇలా చెప్పారు:

ఈ సూక్తిలో మూడు విషయాలను చేయమని ఆజ్ఞాపించ బడింది, అలాగే మూడు విషయాలను చేయవద్దని నిషేధించబడింది. చెడు విషయాల నుండి మనుష్యులను నివారించడం దేవుని కరుణను సూచిస్తుంది; మంచి పనులను చేయమని ఆజ్ఞాపించడం ఆయన మార్గదర్శకత్వాన్ని సూచిస్తుంది. ఈ సూక్తి పవిత్ర ఖుర్ఆన్ యొక్క సమగ్రతకు అత్యుత్తమ ఉదాహరణలలో ఒకటి. ఇది నైతిక ప్రవర్తనకు సంబంధించిన అన్ని స్థాయిలను తనలో సమీకరించింది. అందువల్ల ఇది నిజంగా సమగ్ర సూక్తిగా నిలుస్తుంది మరియు ఖుర్ఆన్ "ప్రతి విషయానికీ స్పష్టమైన వివరణ" అని చేసిన ప్రకటనకు అద్భుతమైన నిదర్శనంగా ఉంటుంది.

ఈ సూక్తి మీరు గుణపాఠము పొందవలెనని అనే పదాలతో ముగుస్తుంది. తజక్కరా అనే పదానికి జకర్ అనే పదంతో సమానమైన అర్థం ఉంది; అంటే "గుర్తుంచుకోవడం" లేదా "అల్లాహ్‌ను స్తుతించడం". కాబట్టి లఅల్లకుం తజక్కరూన్ అంటే: "మీరు అల్లాహ్ హక్కులను మరియు ఆయన ప్రాణుల హక్కులను గుర్తుంచుకోవాలని" లేదా "మీరు అల్లాహ్‌ను స్తుతించి మహిమపరచాలని" అర్థం.

మానవుడు సృష్టించబడిన ప్రధాన ఉద్దేశాలు ఈ రెండే కావున, ఈ సూక్తిలో ఒక శుభవార్త కూడా దాగి ఉంది. అనగా ఈ బోధనను అనుసరిస్తే మీరు మీ సృష్టి యొక్క అసలు లక్ష్యాన్ని సాధిస్తారు.

ఈ సూక్తి ఎంత చిన్నదో గమనించండి. అయినప్పటికీ ఖుర్ఆన్ యొక్క మహిమ గురించి చెప్పబడిన అన్ని అంశాలపై ఇది ఎంత స్పష్టంగా వెలుగు ప్రసరిస్తుందో చూడండి. ఇంత సంక్షిప్తతలో ఇంత విస్తృతమైన మార్గదర్శకత్వం పవిత్ర ఖుర్ఆన్ తప్ప మరే గ్రంథంలోనూ కనిపించదు. అంతేకాకుండా ఇందులో ఎటువంటి అస్పష్టత లేదు, రహస్యార్థం లేదు, అయోమయం లేదు. దీని సందేశం స్పష్టంగా ఉంటుంది. కొద్దిపాటి ఆలోచనతో ఏ వివేకవంతుడైనా దీని సత్యాన్ని గ్రహించగలడు. **(3 వ పేజీలో చదువుము)**

### అహ్మదియ్యా వార్తలు

సయ్యద్నా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు అల్లాహ్ దయతో క్షేమంగా ఉన్నారు.

జమాఅత్ సభ్యులు హుజూరె అన్వర్ కొరకు ప్రత్యేముగా దుఆలు చేయగలరు. అల్లాహ్ తాలా హుజూర్ అన్వర్‌కు ఆరోగ్య వంతమైన, చురుకైన సుదీర్ఘ జీవితంను ప్రసాదించుగాకా!. ఉన్నత ఆశయ సాధనాలను సమకూర్చు గాకా!,అనుక్షణం హుజూర్‌ను రక్షించుచూ దైవదూతలతో సహాయ, సహకారములు అందించుగాక! *(ఆమీన్).*

జమీల్ అహ్మద్ నాసిర్, ప్రింటర్ పబ్లిషర్ గారు ఫజ్లె ఉమర్ ప్రింటింగ్ ప్రెస్ ఖాదియాన్‌లో ముద్రించి అఖ్బారె బదర్ ఖాదియాన్ కార్యాలయము నుండి ప్రచురించిరి. ప్రోప్రైటర్, నిగ్రాన్ బదర్ బోర్డ్ ఖాదియాన్

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్ బ్రిటన్ యొక్క 19వ శాంతి సదస్సు దివి: 16 మే 2026న నిర్వహించడం జరిగింది.**
**అట్టి సందర్భన సయ్యదినా హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ప్రసంగించిన విశ్వాస భరిత ప్రసంగపు సారాంశం సభ్యుల కొరకు..**




**○ ఇస్లాం యొక్క ప్రాథమిక బోధన ఏమిటంటే, ఒక వ్యక్తి తనకు నచ్చినదే ఇతరులకు కూడా నచ్చాలని కోరుకోవాలి. ఇది ఒక గొప్ప స్వర్ణసూత్రం. ప్రపంచం ఈ సూత్రాన్ని అనుసరిస్తే, నిజంగా ఈ ప్రపంచం శాంతికి నిలయంగా మారగలదు.**

**○ సామరస్యం మరియు న్యాయం కోసం కృషి చేయడం అహ్మదీయ ముస్లిం సమాజం యొక్క అత్యంత ముఖ్యమైన లక్ష్యాలలో ఒకటి. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు మేము నిరంతరం శ్రమిస్తున్నాము. ఈ ముఖ్యమైన ఉద్దేశ్య సాధన కోసం, కనీసం కొంతమందికైనా మా సత్యం మరియు న్యాయం యొక్క సందేశం చేరేలా ప్రయత్నిస్తున్నాము. ఇదే లక్ష్యంతో నేను ప్రపంచంలోని ప్రముఖ నాయకులకు లేఖలు రాశాను.**

**○ ఇస్లాం మిత్రుల హక్కులను మాత్రమే కాకుండా, ప్రత్యర్థుల హక్కులను కూడా స్థాపించింది. అలాగే, ఇతర ప్రజల వద్ద జ్ఞానం మరియు వివేకంతో కూడిన మాట కనిపిస్తే దానిని స్వీకరించాలని తన అనుచరులకు ఉపదేశించింది, ఎందుకంటే అది మీ స్వంతంగా కోల్పోయిన వారసత్వమే.**

**○ భవిష్యత్ తరాల కోసం శాంతియుతమైన ప్రపంచాన్ని విడిచిపెట్టడం మనందరి బాధ్యత. ఆ లక్ష్యం కోసం మన వంతు కృషి చేయాలి. లేకపోతే, రాబోయే తరాలు మనల్ని బాధ్యులుగా నిలబెట్టి, "మా కోసం మీరు ఎంత విధ్వంసానికి గురైన ప్రపంచాన్ని వదిలి వెళ్లారు?" అని ప్రశ్నిస్తాయి.**

తఅవ్వుజ్ మరియు తస్మియా పఠించిన తరువాత, హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారు ఇలా ప్రసంగించారు:

గౌరవనీయ అతిథులారా!, అస్సలాము అలైకుం వ రహ్మతుల్లాహి వ బరకాతుహు.

ఈ కార్యక్రమానికి విచ్చేసిన మీ అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. అహ్మదీయ ముస్లిం జమాఅత్ గత రెండు దశాబ్దాలుగా ఈ శాంతి సదస్సును నిర్వహిస్తోంది. ప్రపంచ పరిస్థితులు రోజురోజుకు దిగజారుతున్న నేపథ్యంలో, ఈ ప్రయత్నాల వల్ల వాస్తవంగా ఎలాంటి ప్రయోజనం కలిగిందని చాలామంది ప్రశ్నిస్తున్నారు.

నిస్సందేహంగా ఇది సముచితమైన ప్రశ్న. అయితే, ఇస్లాం మాకు అలసిపోకుండా, నిరుత్సాహపడకుండా నిరంతరం కృషి చేయాలని బోధిస్తుంది. ప్రపంచంలో సానుకూల మార్పు కోసం, మానవజాతి మనుగడ కోసం చేసే ప్రయత్నాల కంటే గొప్ప సేవ మరేదీ ఉండదు.

యుద్ధాలు, అశాంతి, అసురక్షిత పరిస్థితులు, ద్వేషం మరియు అన్యాయాన్ని మనం అరికట్టకపోతే, నాగరికత మన కళ్ల ముందే క్రమంగా కూలిపోతున్న దృశ్యాన్ని చూడవలసి వస్తుంది. ఆ విధ్వంసం ప్రభావం అనేక తరాలపై పడుతుంది. రెండో ప్రపంచ యుద్ధం సృష్టించిన వినాశనం అత్యంత భయానకమైనది. అయితే అప్పట్లో అణ్వాయుధాలు అమెరికా ఒక్క దేశానికే ఉండేవి. కానీ నేడు అనేక దేశాలు అణు శక్తిని కలిగి ఉన్నాయి, అంతేకాక ఆధునిక అణ్వాయుధాలు అప్పటి వాటికంటే మరింత ప్రమాదకరమైనవి, విధ్వంసకరమైనవి.

ఈ రోజు, పరిశోధకులు మరియు విశ్లేషకులు చేసిన కొన్ని అధ్యయనాలను మీ ముందుంచబోతున్నాను. అవి మన ముందున్న ప్రమాదం ఎంత భయంకరమైనదో తెలియజేస్తాయి. ఇటువంటి విధ్వంసక ఆయుధాల వినియోగం అంటే మన సొంత పిల్లలపై, రాబోయే తరాలపై యుద్ధం చేయడమే.

ఐర్లాండ్ అధ్యక్షుడు మైకేల్ హిగిన్స్ హెచ్చరిస్తూ, మనం ఇప్పుడు యుద్ధ బెదిరింపులు ప్రధాన లక్షణంగా ఉన్న యుగంలోకి ప్రవేశించామని చెప్పారు. దౌత్యపరమైన చర్చలు, పరస్పర అవగాహనకు బదులుగా విభేదాలు, ఉద్రిక్తతలు, రక్తపాతం ప్రోత్సహించబడుతున్నాయని ఆయన పేర్కొన్నారు.

స్లోవేకియా ప్రధానమంత్రి కూడా నేడు ప్రజలు ఆయుధాలు మరియు విధ్వంసక యుద్ధాల గురించి ఎలాంటి భయం లేకుండా మాట్లాడుతున్నారని, దాంతో అసురక్షిత భావన మరియు ఆందోళన పెరుగుతున్నాయని అన్నారు.

ఇస్లాం యొక్క ప్రాథమిక బోధన ఏమిటనగా, ఒక వ్యక్తి తనకు ఇష్టమైన దానినే ఇతరులకు కూడా ఇష్టపడాలి. ప్రపంచం ఈ బంగారు సూత్రాన్ని అనుసరిస్తే, నిజంగా ఈ భూమి శాంతి నిలయంగా మారగలదు.

జర్మనీ చాన్సలర్ కూడా ఇరాన్‌తో యుద్ధానికి వ్యతిరేకంగా మాట్లాడారు. యుద్ధాన్ని వ్యతిరేకించే ప్రతి వ్యక్తిని నేను అభినందించినట్లే, ఆయనను కూడా ప్రశంసిస్తున్నాను. అయితే మాటలు మాత్రమే సరిపోవు; ఆచరణాత్మక చర్యలు అవసరం. విధాన పరమైన చర్యలను పరిశీలిస్తే అవి చాలా తక్కువగా కనిపిస్తాయి.

పోప్ లియో, టర్కీలో మాట్లాడుతూ, మూడో ప్రపంచ యుద్ధం క్రమంగా జరుగుతోందని వ్యాఖ్యానించారు.

నేను చెప్పేదేమిటంటే, వాస్తవానికి మూడో ప్రపంచ యుద్ధం ఇప్పటికే కొనసాగుతోంది. అయితే ప్రజలు దాని భయంకరతను ఎదుర్కోకుండా ఉండేందుకు దాన్ని నిరాకరించే ప్రయత్నం చేస్తున్నారు.

స్పెయిన్ ప్రధానమంత్రి మాట్లాడుతూ, ఒక చట్టవిరుద్ధ చర్యను మరొక చట్టవిరుద్ధ చర్యతో సరిచేయలేమన్నారు. చిన్న చిన్న ఘర్షణలు తరచుగా భారీ యుద్ధాలకు దారి తీస్తాయి. అలాంటి పరిస్థితుల్లో అపారమైన జాగ్రత్త, వివేకం అవసరం. ఒక పక్షం అన్యాయం చేస్తే, మరో పక్షం కూడా అదే మార్గాన్ని అనుసరించ కూడదు. కానీ నేడు అగ్రరాజ్యాలు న్యాయం మరియు అంతర్జాతీయ చట్టాలను పక్కన పెట్టాయి. వారి దృష్టిలో అవన్నియు వారి స్వప్రయోజనాలే.

ప్రభుత్వాల పని ప్రజల సంక్షేమం కోసం పనిచేయడం. ప్రజల జీవన

ప్రమాణాలు మెరుగుపడేలా నిర్ణయాలు తీసుకోవాలి. కానీ నేటి పాలకులు ప్రజల జీవితాలను మరింత కష్టతరం చేసే చర్యలే తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. తమ వైఫల్యాలను యుద్ధాల వెనుక దాచుకుంటూ ప్రపంచాన్ని అంతులేని విధ్వంసం వైపు నెడుతున్నారు.

ఒక ప్రముఖ అమెరికన్ మేధావి ఇటీవల పాశ్చాత్య దేశాల్లో, ముఖ్యంగా అమెరికాలో, ప్రతి సమస్యకు సైనిక శక్తినే పరిష్కారంగా భావిస్తున్నారని అన్నారు. దౌత్య చర్చలకు బదులుగా యుద్ధాన్ని పరిష్కారంగా చూస్తున్నారు. ఇరాన్‌కు సంబంధించిన ఘర్షణ అత్యంత బాధాకర పరిస్థితులకు నాంది కావచ్చు. అన్యాయం మరియు ద్వంద్వ ప్రమాణాల వల్ల ప్రతి ఒక్కరూ నష్టపోతారు.

ఇస్లాం ప్రకారం అణచివేసే వారికి, అణచివేయ బడేవారికి ఇద్దరికీ సహాయం చేయాలి. ప్రతీకార అగ్నిని ఆర్పివేయాలని ఇస్లాం బోధిస్తుంది. ప్రతీకారం అనుమతించబడినా, అది జరిగిన అన్యాయం మేరకే పరిమితం కావాలి.

ప్రపంచంలో న్యాయాన్ని కాపాడాల్సిన సంస్థలు విఫలమయ్యాయి. లీగ్ ఆఫ్ నేషన్స్ ఎలా విఫలమైందో, ఐక్యరాజ్యసమితి కూడా అదే దిశగా వెళ్లింది. ఐదు దేశాలకు వీటో హక్కు ఇవ్వడం న్యాయానికి విరుద్ధం.

కెనడా ప్రధానమంత్రి కూడా నేడు శక్తివంతులు కోసం ఒకరకమైన చట్టాలు, బలహీనుల కోసం మరోరకమైన చట్టాలు ఉన్నాయని వ్యాఖ్యానించారు.

మానవ హక్కుల చార్టర్ ఇప్పుడు కేవలం కాగితాలపై ఉన్న మాటలుగా మారిపోయింది. దానికి గౌరవం తగ్గిపోయింది.

పాశ్చాత్య దేశాలు చిన్న దేశాలపై దోపిడీ చర్యలు చేపడుతున్నాయి. మహిళల హక్కులను కాపాడుతున్నామనే పేరుతో వాటిని సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. కానీ వాస్తవానికి ఆ యుద్ధాల వల్ల వేలాది మంది మహిళలు నిరాశ్రయులై, సహాయం లేకుండా, బహిరంగ ఆకాశం కింద జీవించవలసి వస్తోంది.

యూరోపియన్ పార్లమెంట్‌లోని ఒక స్పానిష్ సభ్యుడు మాట్లాడుతూ, సిరియా, ఇరాక్, లెబనాన్, ఇప్పుడు ఇరాన్‌లలో జరిగిన జోక్యాల ఫలితాలను మనం చూస్తున్నామని అన్నారు. శక్తివంతమైన దేశాలు తమ అన్యాయ యుద్ధాలకు సమర్థనలు సృష్టించుకోవడానికి ఇటువంటి కారణాలను చూపుతాయని మనకు తెలుసని చెప్పారు.

ముస్లింలుగా, ఇస్లాం పేరుతో అనేక మంది వ్యక్తులు, సంస్థలు అన్యాయానికి పాల్పడుతున్నాయని మేము అంగీకరిస్తాము. మీడియా వాటిని విస్తృతంగా ప్రచారం చేస్తూ ఇస్లాం గురించి అపోహలను వ్యాప్తి చేస్తోంది. అయితే ఏ మతమైనా, దాని పేరుతో కొందరు చేసిన తప్పులను మొత్తం మతంపైనే మోపడం కూడా ఒక అన్యాయమే.

సామరస్యాన్ని, న్యాయాన్ని స్థాపించడం అహ్మదీయ ముస్లిం సమాజం యొక్క ప్రధాన లక్ష్యాలలో ఒకటి. అందుకోసం మేము నిరంతరం కృషి చేస్తున్నాము. ఈ శాంతి సదస్సు కూడా అదే లక్ష్యంతో నిర్వహించబడుతోంది.

అదే ఉద్దేశ్యంతోనే నేను ప్రపంచ నాయకులకు లేఖలు రాశాను. ఇజ్రాయెల్ ప్రధానమంత్రికి లేఖ రాసి తౌరాత్ బోధనలను గుర్తుజేశాను. అలాగే ఇరాన్ అధ్యక్షుడికి, ఇతర ముస్లిం నాయకులకు కూడా లేఖలు రాశాను. బ్రిటన్, అమెరికా, చైనా నాయకులకు కూడా ప్రపంచం విధ్వంసం వైపు సాగుతున్నదని ఆలోచించమని విజ్ఞప్తి చేశాను. మానవజాతి మనుగడే ప్రమాదంలో ఉంది. కానీ దురదృష్టవశాత్తూ వారు దీనిని పట్టించుకోవడం లేదు.

వ్యక్తిగత కోరికలను అనుసరించడం వల్ల న్యాయం నుండి దూరం కావచ్చని ఇస్లాం ధర్మము హెచ్చరిస్తుంది. న్యాయాన్ని స్థాపించాలని, స్థిరంగా నిలవాలని పవిత్ర ఖుర్ఆన్ బోధిస్తుంది. శత్రుత్వం కూడా మనల్ని అన్యాయానికి దారి తీయ కూడదు. న్యాయంగా వ్యవహరించడం దైవభక్తికి మరింత దగ్గరగా ఉంటుంది.

ఇస్లాం మిత్రుల హక్కులను మాత్రమే కాదు, ప్రత్యర్థుల హక్కులను కూడా స్థాపించింది. ఇతర ప్రజల వద్ద జ్ఞానం, వివేకం కనబడితే దానిని స్వీకరించమని సూచిస్తుంది.

ప్రపంచంలోని ఎక్కువ మంది ప్రజలు ఇప్పటికీ శాంతినే కోరుకుంటున్నారు. కానీ దానికోసం ప్రతి వ్యక్తి తన పాత్రను పోషించాలి. పోప్ పేర్కొన్నట్లుగా, మూడో ప్రపంచ యుద్ధం ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో ప్రారంభమైందని నేను భావిస్తున్నాను. అలాంటి యుద్ధం కలిగించే విధ్వంసం గత ప్రపంచ యుద్ధాల కంటే మరింత భయంకరంగా ఉండవచ్చని నేను భయపడుతున్నాను.

మన తర్వాతి తరాలకు శాంతియుత ప్రపంచాన్ని అందించడం మన బాధ్యత. లేకపోతే వారు "మా కోసం మీరు ఎలా వినాశనమైన ప్రపంచాన్ని వదిలివెళ్లారు?" అని మనలను ప్రశ్నిస్తారు.

అందువల్ల ఈ శాంతి సదస్సు ఆ ఉన్నత లక్ష్యం కోసం చేస్తున్న ఒక ప్రయత్నం. దేవుడు దీనిని శాంతిఆకాంక్ష యొక్క మొదటి కిరణంగా మార్చుగాకా!. ఈ యుగంలో శాంతి అవసరాన్ని ప్రపంచం గుర్తించుగాకా! యుద్ధ మేఘాలు తొలగిపోవుగాకా! శాంతి ఉదయం ప్రకాశించుగాకా!

మీ అందరికీ మరోసారి ధన్యవాదాలు.

హుజూర్ గారి ప్రసంగం రాత్రి 7:09 గంటల వరకు కొనసాగింది. అనంతరం హుజూర్ అన్వర్ అయ్యదహుల్లాహ్ తాలా గారు దుఆ చేయించారు. దుఆ తరువాత అతిథులందరికీ భోజనం వడ్డించబడింది. భోజనం అనంతరం ప్రధాన టేబుల్ వద్ద ఉన్న గౌరవనీయ అతిథులను హుజూర్ అన్వర్ గారు కలుసుకొని సంక్షిప్తంగా మాట్లాడారు. ఆ తరువాత సుమారు 7:45 గంటలకు హుజూర్ గారు అయివానే మస్రూర్ నుండి బయలుదేరారు.

(శాంతి సదస్సు నివేదిక మిగతా భాగం తదుపరి సంచికలో ప్రచురించబడుతుంది.)

(1వ పేజీ తరువాత తఫ్సీర్)

ఇప్పుడు ఈ సూక్తిలోని విషయాన్ని కొంత వివరంగా వివరిస్తాను. ప్రపంచంలోని ప్రతి విషయానికీ రెండు కోణాలు ఉంటాయి. ఒకటి సానుకూల (అంగీకార) కోణం, మరొకటి ప్రతికూల (నిరాకరణ) కోణం. ఈ రెండు కోణాలు సంపూర్ణంగా లేకపోతే ఏదీ సంపూర్ణం కాదు. అనగా, దాని పరిపూర్ణతకు అవసరమైన అన్ని గుణాలు అందులో ఉండాలి. అలాగే దాని మహత్తును తగ్గించే అన్ని లోపాల నుండి అది స్వచ్ఛంగా ఉండాలి.

పరిపూర్ణ మతబోధనకు అవసరమైన మూడు ముఖ్య లక్షణాలు:-

ఒక మతబోధన సంపూర్ణంగా ఉండాలంటే ఈ క్రింది లక్షణాలు ఉండాలి:

(1) ఆధ్యాత్మికతను పరిపూర్ణతకు చేర్చే కార్యాలను చేయమని ఆజ్ఞాపించాలి; అలాగే ఆ పరిపూర్ణతను పొందకుండా చేసే కార్యాలను నిషేధించాలి. (2) కేవలం ఒక వ్యక్తి లేదా ఒక జాతికి మాత్రమే కాకుండా అనేక మంది వ్యక్తులు, అనేక జాతులకు వర్తించే చట్టాలను రూపొందించేటప్పుడు, అవి ఎవరికోసం ఉద్దేశించబడ్డాయో వారి స్వభావాలు, సామర్థ్యాలు మరియు పరిస్థితులను పరిగణనలోకి తీసుకోవాలి. ప్రతి వ్యక్తి తన తన సామర్థ్యానికి అనుగుణంగా ఆచరించగలిగే విధంగా ఆదేశాలను ఇవ్వాలి. (3) పరిపూర్ణ బోధన యొక్క మూడవ లక్షణం ఏమిటంటే, దాని ఆజ్ఞలు మానవ జాతికి ఆచరణయోగ్యంగా ఉండాలి. వాటివల్ల మతంలో, నైతికతలో, బుద్ధిలో లేదా నాగరికతలో ఎటువంటి అవినీతి లేదా చెడు ఫలితాలు ఉత్పన్నం కాకూడదు. అల్లాహ్ ఈ మూడు లక్షణాలన్నింటినీ ఈ ఒక్క సూక్తిలో సమీకరించాడు. ఈ సూక్తి ఎంత చిన్నదో గమనించండి. అయినప్పటికీ పరిపూర్ణతకు సంబంధించిన రెండు కోణాలు, అంగీకారం మరియు నిరాకరణ ఎంత అందంగా, ఎంత చక్కగా ఇందులో పొందుపరచబడ్డాయో చూడండి. ఇందులో మూడు సద్గుణాలు ఆజ్ఞాపించబడ్డాయి. అదల్ (న్యాయం), ఇహ్సాన్ (ఉపకారం) ఈతా-ఇ-జిల్ ఖుర్బా (బంధువుల పట్ల ప్రేమతో, ఉదారంగా వ్యవహరించడం). అలాగే మూడు దుర్గుణాలు నిషేధించబడ్డాయి. ఫహషాయి (అసభ్యత, నీచ ప్రవర్తన)మున్కర్ (చెడు, అనైతిక కార్యం) బఘీ (అత్యాచారం, దురాక్రమణ, హద్దులు దాటడం).అద్ల్ (న్యాయం) అంటే సమానత్వం మరియు నిష్పక్షపాతత్వం. అంటే ఒక వ్యక్తి తనతో ఇతరులు ఎలా ప్రవర్తిస్తారో, తాను కూడా వారితో అలాగే ప్రవర్తించాలి. ఎవరైనా అతనిపై అన్యాయం చేస్తే, అతను జరిగిన అన్యాయానికి సమానమైన ప్రతిఫలాన్ని మాత్రమే కోరవచ్చు; కానీ దానికంటే ఎక్కువగా ప్రతీకారం తీర్చుకునే హక్కు అతనికి లేదు. అలాగే ఎవరైనా అతనితో మంచిగా ప్రవర్తిస్తే, కనీసం అంతే స్థాయిలో మంచి ప్రవర్తనను తిరిగి చూపడం అతని విధి.

(తఫ్సీర్-ఎ-కబీర్, సంపుటి 4, పుట 168)

**ప్రపంచ అహ్మదీయ్య జమాఅత్ సభ్యులకు ఒక ముఖ్య ప్రకటన:**

మన ప్రియతమ ఖలీఫా, అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి శుభప్రదమైన సూచన మేరకు తమను తాము ఆధ్యాత్మికపరమైన పటిష్టమైన కోటలో చేరుకొనుటకు ఈ రోజు మీరు ఈ క్రింది దుఆలను పఠించారా?.

(1) سُبْحَانَ اللهِ وَبِحَمْدِهٖ سُبْحَانَ اللهِ الْعَظِيْمِ اَللّٰهُمَّ صَلِّ عَلٰى مُحَمَّدٍ وَّاٰلِ مُحَمَّدٍ

సుబ్‌హానల్లాహి వబిహమ్‌దిహీ సుబ్‌హానల్లాహిల్ అజీమ్ అల్లాహుమ్మ సల్లెఅలా ముహమ్మదిన్ వ్వ అలే ముహమ్మద్. (200 సార్లు పఠించవలెను)

(2) اَسْتَغْفِرُ اللهَ رَبِّيْ مِنْ كُلِّ ذَنْبٍ وَّاَتُوْبُ اِلَيْهِ

అస్తఘ్‌ఫిరుల్లాహ రబ్బి మిన్‌కుల్లి జన్‌బిన్ వ్వఅతూబు ఇలైహి.

**100 సార్లు పఠించవలెను.**

(3) رَبِّ كُلُّ شَيْءٍ خَادِمُكَ رَبِّ فَاحْفَظْنِيْ وَانْصُرْنِيْ وَارْحَمْنِيْ

రబ్బికుల్లి షైయిన్ ఖాదిముక రబ్బి ఫాహ్‌ఫజ్‌నీ వన్‌సుర్‌నీ వర్‌హమ్‌నీ.

**100 సార్లు పఠించవలెను.**

(25 సం॥ పైబడిన వారు పైన పేర్కొనబడినట్లుగా పఠించవలెను. 15 నుండి 25 సం॥ల వారు 100సార్లు, 15సం॥ల కంటే తక్కువ వయస్సు గలవారు 33 సార్లు, చిన్న పిల్లల తరుపున వారి తల్లిదండ్రులు 3నుండి 4 సార్లు పఠిస్తూ, పిల్లలతో కూడ పఠింపజేయవలెను.)

**నూరుల్ ఇస్లాం శాఖ:**

**అహ్మదియ్య ముస్లిం జమాఅత్‌ను గూర్చి సరైన వివరాలు తెలుసుకోవడం కోసం మీరు ఈ క్రింది టోల్ ఫ్రీ నెంబర్‌ను సంప్రదించగలరు.**

**టోల్ ఫ్రీ నెంబర్: 1800 103 2131**

**సంప్రదించు సమయం: ప్రతిరోజు ఉదయం 08:30 నుండి రాత్రి 10:00 వరకు. (ప్రతి శుక్రవారం సెలవు).**

# జుమా ప్రసంగము

**"ఓ అల్లాహ్!, నిన్ను చేరే మార్గానికి మమ్మల్ని నడిపించినందుకు, మరియు నీ పవిత్ర గ్రంథాలను అవతరింపజేయడం ద్వారా ఆలోచన మరియు తర్కం యొక్క దోషాల నుండి మమ్మల్ని రక్షించినందుకు నీకు లెక్కలేనన్ని కృతజ్ఞతలు. ప్రవక్తల అధిపతి, హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లంను ఎన్నుకోబడిన వారు, వారి సంతతి మరియు వారి సహచరులపై మేము ఆశీస్సులు కోరుతున్నాము. వారి ద్వారా, అల్లాహ్ తాలా దారి తప్పిన యావత్ ప్రపంచాన్ని సరైన మార్గంలోకి నడిపించాడు. వారు (స), తప్పుదారి పట్టిన ప్రజలను తిరిగి సరైన మార్గంలోకి నడిపించిన గురువు మరియు ఉపకారి.**

---

**ఈ దివ్యమైన .. మతం యొక్క దృఢమైన స్థాపన, తమ విశ్వాసానికి మరియు జాతికి వినాశన బీజాలు నాటుతుందని వారు భయపడ్డారు. వారి హృదయాలలో గాఢంగా నాటుకుపోయిన ఈ భయం కారణంగా, వారు అత్యంత దుర్మార్గమైన మరియు క్రూరమైన చర్యలకు పాల్పడి, అనేక మంది ముస్లింలను దారుణంగా హత్య చేశారు.**

**సయ్యద్నా అమీరుల్ మోమినీన్ హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ క్రీ.శ 27 ఫిబ్రవరి 2026 ( 27 తబ్లీఘ్ 1404 హి.శ) తేదిన మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్‌లో ప్రసంగించిన జుమా ఖుత్బా.**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ
أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ ۔ بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ
اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعَالَمِيْنَ ۔ اَلرَّحْمٰنِ الرَّحِيْمِ ۔ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ۔
إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ۔ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ۔
صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ۔

ప్రవక్తలందరూ తౌహీద్ (అల్లాహ్ ఏకత్వం)ను స్థాపించడానికే ఈ ప్రపంచానికి వచ్చారు, మరియు వారు ఈ బోధనను తమ ప్రజలకు అందించారు. దురదృష్టవశాత్తు, చాలా మంది ప్రజలు ఈ బోధనను విడిచిపెట్టారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా అదే సందేశాన్ని తీసుకువచ్చారు, మరియు వారు కూడా తన అనుచరులలో తౌహీద్ స్ఫూర్తిని నింపే లక్ష్యంతో వచ్చారు.. అంతేకాకుండా, ఈ విషయంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క స్థానం సాటిలేనిది.

వారు ప్రజలకు తౌహీద్‌ను స్వీకరించమని బోధించినప్పుడల్లా, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నుండి జ్ఞానాన్ని పొందిన తర్వాత, అలా చేయడానికి మద్దతుగా ఆధారాలను చూపించారు. వారు షిర్క్‌కు (అల్లాహ్‌కు భాగస్వాములను కల్పించడం) వ్యతిరేకంగా పోరాడినప్పుడు, ఆధారహితముగా పోరాడలేదు. నిజానికి వారు షిర్క్ యొక్క దుష్ప్రభావాలను వివరించారు. అలా విడమర్చి చెప్పిన తరువాత ఆ ప్రజలలో దాని పట్ల విముఖతను నింపారు. అంతేకాకుండా, ప్రవక్త (స) అనుచరులు తమ ఆచరణల ద్వారా తౌహీద్ భావన మరియు షిర్క్ పట్ల విముఖత వారిలో లోతుగా పాతుకుపోయాయని చూపించారు.

ఇందుకు కారణం ఏమంటే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు అవతరింపజేసిన బోధన ఎంత సమగ్రమైనదంటే, ఒకసారి ఒక వ్యక్తి దాని వాస్తవాన్ని నిజంగా గ్రహిస్తే, దాని నుండి వైదొలగడం అసాధ్యం. ప్రవక్త (స) అనుచరులను ఎంతగానో ప్రభావితం చేసిన ఈ బోధన అంత ప్రభావవంతంగా ఉండటానికి కారణం, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ప్రతి మాట మరియు ప్రతీ ఆచరణ దానికి నిజమైన ప్రతిబింబం కావడమే. వారు (స) సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తనకు ప్రసాదించిన అద్భుతమైన బోధనకు సాక్షాత్ స్వరూపం.

ఇతర జాతుల వారు తమ ప్రవక్తలను ఆరాధించడం ప్రారంభించినట్లే, ముస్లిం సమాజం కూడా ఈ ఘోరమైన పాపాన్ని ఎక్కడ అనుసరిస్తుందేమోనని వారు (స) ప్రధానంగా ఆందోళన చెందారు. అందువల్ల, తనను ఎప్పటికీ సర్వశక్తిమంతుడైన దేవునికి సమానంగా చూడకూడదని వారు శరణు కోరారు. అంతేకాకుండా, వారు ఈ విషయాన్ని తన సమాజానికి బోధించి, తనను ఎన్నడూ షిర్క్ చేయడానికి సాధనంగా చేసుకోవద్దని వారికి సూచించారు.

(ముస్నద్ అహ్మద్ బిన్ హంబల్, సంపుటి 3,పుట 54, అబూహురైరా రజి, హదీస్ 7352, ఆలముల్-కుతుబ్, బీరూట్, 1998)

సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తప్ప మరెవరినీ ఆరాదించవద్దని ప్రవక్త (స) వారికి బోధించారు. గత ఉపన్యాసాలలో, నేను అల్లాహ్ పట్ల ప్రేమ మరియు ప్రవక్త (స) ఆరాధన అనే అంశాన్ని గూర్చి చర్చించాను. ఈ విషయంలో దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవితం నుండి నేను వివరించిన ప్రతి సంఘటన మనకు తౌహీద్ వైపు మార్గనిర్దేశం చేస్తుంది, మరియు తౌహీద్ స్థాపన పట్ల ప్రవక్త (స) మనస్ఫూర్తి యొక్క అభిరుచిని, ప్రగాఢమైన తపనను మనం చూడవచ్చు. ఒకవైపు, ఇది తౌహీద్‌ను స్థాపించడంలో వారి అత్యున్నత స్థాయిని ప్రతిబింబిస్తుంది, ఈ స్థాయిని సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారికి చిన్నప్పటి నుంచే ప్రసాదించాడు. అయితే దీనితో పాటు, వారిపై అవతరింపజేసిన సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క పరిపూర్ణ బోధన గురించి కూడా మనం మరింత లోతైన అవగాహనను పొందుతాము. పవిత్ర ఖురాన్‌లో, అల్లాహ్ అన్బియా అధ్యాయంలో పేర్కొన్నట్లుగా, తౌహిద్ గురించి వివిధ మార్గాల్లో మనకు పదేపదే బోధించబడింది:

**వమా అర్‌సల్‌నా మిన్ ఖబ్‌లిక మిన్ ర్రసూలిన్ ఇల్లా నూహీ ఇలైహీ అన్నహు లా ఇలాహా ఇల్లా అనా ఫఅబుదూని (అన్బియా:26)**

అనగా,"మరియు నీకు ముందు మేము పంపిన ప్రతి ప్రవక్తకు, 'నేను తప్ప వేరే దేవుడు లేడు; కాబట్టి నన్నే ఆరాధించు' అని అవతరింపజేయకుండా ఉండలేదు."

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు బోధించబడిన ఆరాధనా పద్ధతి మరియు తౌహీద్ యొక్క హక్కులను నెరవేరుస్తూ వారు ఆరాధించిన విధానం ఎంత గొప్పదంటే, దానిలోని ఒక చిన్న భాగం కూడా మరే ఇతర మతంలోనూ కనిపించదు. అప్పుడు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ పవిత్ర ఖురాన్‌లో ఇలా తెలిపాడు:

**ఖుల్ ఇన్నీ ఉమిరుతూ అన్ అఅబుదల్లాహ ముఖ్‌లిసన్ ల్లహు ద్దీన**

అనగా "అల్లాహ్ పట్ల నిజాయితీగా ఉండి, అల్లాహ్‌ను ఆరాధించాలని నేను నిజంగా ఆజ్ఞాపించాను" (జ్జుమర్ :12)

ఈ విధంగా, నిజమైన ముస్లిం దీనిని చదివినప్పుడు, అతను కూడా సర్వశక్తిమంతుడైన అల్లాహ్‌ను పూర్తి చిత్తశుద్ధితో ఆరాధించాలని, దేవుని స్వచ్ఛమైన ఏకత్వాన్ని స్థాపించడానికి కృషి చేయాలని మరియు పవిత్ర ఖురాన్‌లో ఇవ్వబడిన ఆజ్ఞకు అనుగుణంగా స్థాపించబడిన ప్రవక్త (స)యొక్క నమూనాను అనుసరించాలని ప్రకటిస్తాడు. దేవుని ఏకత్వాన్ని నిజంగా స్థాపించడంతో పాటు, మనం మన ఆరాధన ప్రమాణాలను కూడా పెంచుకుంటే, అప్పుడు మనం నిజమైన విప్లవాన్ని తీసుకు రాగలము. లేకపోతే, అవి కేవలం వాదనలుగానే మిగిలిపోతాయి. అప్పుడు మాత్రమే మనం ఏకైక దేవునిపై నిజమైన విశ్వాసులుగా పరిగణించబడటానికి అర్హులమవుతాము.

మరల సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**వఅబుదుల్లాహ వలా తుష్‌రికూ బిహి షైఅ.**

అనగా "మీరు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి, ఆయనకు దేనినీ సాటి కల్పించకండి." (అన్నిసా :37)

మరొక చోట, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు:

**వ ఇలాహుకుం ఇలా హున్ వ్వాహిద్ లా ఇలాహ ఇల్లా హువర్రహ్మాను ర్రహీం**

అనగా "మరియు మీ దైవం ఏకైక దైవం; ఆయన తప్ప వేరే దైవం లేదు, ఆయన అత్యంత దయామయుడు, కరుణామయుడు." (బఖరా :164)

ఆ తర్వాత, పవిత్ర ఖురాన్ చివర భాగంలో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తన ఏకత్వాన్ని ఇలా చాటిచెప్పాడు:

**ఖుల్ హువల్లాహు అహద్, అల్లాహు స్సమద్, లం యలిద్ వలం యూలద్, వలం యకున్‌ల్లహు కుఫువన్ అహద్.**

అనగా "ఇలా పలకండి: ఆయనే అల్లాహ్, ఏకైక దైవం. అల్లాహ్ స్వయం సమృద్ధుడు మరియు అందరి ఆశ్రయం. ఆయన ఎవరికీ జన్మనివ్వలేదు, ఎవరికీ జన్మించనూ లేదు. మరియు ఆయనకు సమానమైన వారు ఎవరూ లేరు."

(ఇఖ్లాస్: 2-5)

ఇక్కడ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తనకు ఎవరినీ సాటి కల్పించకూడదని అన్ని రకాల అన్యారాధనలను (షిర్క్) పూర్తిగా ఖండించాడు మరియు దైవ ప్రవక్త (స.అ.స) ద్వారా ఈ విషయాన్ని ప్రపంచానికి చాటిచెప్పమని ఆజ్ఞాపించాడు. కాబట్టి, ప్రవక్త (స)ను విశ్వసించిన వారమైన మనము, ఈ అధ్యాయంలోనూ మరియు పవిత్ర ఖురాన్‌లోని అనేక ఇతర చోట్లనూ ప్రకటించబడిన దైవపు ఈ స్వచ్ఛమైన ఏకత్వాన్ని ప్రపంచానికి చాటిచెప్పడం మన విధి. మరియు మన మాటల ద్వారా, మన చేతల ద్వారా, ఈ రెండింటి ద్వారానూ, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మాత్రమే ఏకైక దైవమని, ఆయనకు ఏ అవసరమూ లేదని (అన్ని అవసరాలకు అతీతుడని), వాస్తవానికి సమస్త సృష్టి ఆయనపైనే ఆధారపడి ఉందని మనం ప్రపంచానికి నిరూపించాలి. ఆయన ఎవరికీ తండ్రి కాదు, ఎవరికీ కుమారుడు కాదు. మరియు ఎవరూ ఎప్పటికీ ఆయనకు సమానం కాలేరు.

ఈ ప్రకటన, ఇతర మతాలలో కనిపిస్తున్న కలుషితమైన బోధనలన్నింటినీ

ఖండిస్తుంది. ఈ బోధనను ప్రకటించడం ద్వారానే ఒక వ్యక్తి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ సామీప్యాన్ని పొందగలడు. ఈ బోధనకు అత్యున్నత మరియు శ్రేష్ఠమైన ఉదాహరణ మన నాయకుడు, దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం). వారి జీవితంలోని ప్రతి క్షణం దైవ ఏకత్వాన్ని స్థాపించడానికే గడిచింది. నిజానికి, నేను ఇంతకు ముందే చెప్పినట్లుగా, వారు బాల్యం నుండే, స్వచ్ఛమైన తౌహీద్‌ను స్థాపించడానికి సర్వశక్తిమంతుడైన అల్లాహ్ వారికి మార్గనిర్దేశం చేశాడు. నేను పవిత్ర ఖురాన్ నుండి కొన్ని ఉదాహరణలను మాత్రమే అందించాను, అయితే వాస్తవానికి పవిత్ర ఖురాన్ ఈ సందేశంతో నిండి ఉంది.

ఇప్పుడు నేను హజ్రత్ ముహమ్మద్ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) జీవితంలోని కొన్ని సంఘటనలను వివరిస్తాను. అవి, వారి బాల్యం నుండి ప్రవక్తగా ప్రకటించుకునే సమయం వరకు, మరియు నిజానికి, వారి జీవితాంతం దైవ ఏకత్వాన్ని స్థాపించాలనే హృదయపూర్వకమైన కోరికను కలిగి ఉండి, దాని కోసం ఎలా కృషి చేశారో తెలియజేస్తాయి. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) స్వభావం ఎంత స్వచ్ఛమైనదంటే, తౌహీద్ పట్ల ప్రేమ వారి అణువణువులోనూ నిండి ఉంది. ప్రవక్త పదవికి ఎదగక ముందే, వారు సహజంగానే షిర్క్‌ను, విగ్రహారాధనను అసహ్యించుకునేవారు.

హజ్రత్ ఉమ్మే ఐమాన్ (ర.అ.) కథనం ప్రకారం ఇలా గలదు. ఖురైష్ ప్రజలు బువానా విగ్రహాన్ని ఎంతో గౌరవించేవారు. వారు దానిని సందర్శించి, దానికి బలులు అర్పించేవారు. సంవత్సరానికి ఒకసారి, వారు రోజంతా దాని ఆరాధనకే అంకితమయ్యేవారు. అబూ తాలిబ్ తన ప్రజలతో అక్కడికి వెళ్ళేవారు మరియు దైవ ప్రవక్త (స.అ.సం)ను కూడా తీసుకువెళ్లాలని కోరుకునేవారు, కానీ దైవ ప్రవక్త (స.అ.సం) ఎంతగా నిరాకరించేవారంటే, ఒక సందర్భంలో ప్రవక్త (స) మేనత్తలు మరియు అబూ తాలిబ్ ప్రవక్త ()పై తీవ్రంగా ఆగ్రహించి, "ఓ ముహమ్మద్, నీకేం కావాలి? నీ ప్రజలతో వారి పండుగలో చేరి, వారి సమూహాన్ని పెంచవా?" అని అన్నారు. చివరికి, తన మేనత్తల పట్టుదల మేరకు, ప్రవక్త (స) ఆ విగ్రహం వద్దకు వెళ్లారు, కానీ వెంటనే తీవ్ర భయంతో తిరిగి వచ్చి, "నేను అక్కడ ఒక వింత దృశ్యాన్ని చూశాను" అని చెప్పారు. వారి మేనత్తలు, అంతటి సజ్జనుడిని సైతాను పీడించలేదని చెప్పి, నీవు ఏమి చూశావని అడిగారు. అందుకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సమాధానమిచ్చారు, "నేను విగ్రహం దగ్గరకు వెళ్లడం ప్రారంభించినప్పుడల్లా, తెల్లని వస్త్రాలు ధరించిన ఒక వ్యక్తి, 'ఓ ముహమ్మద్, వెనక్కి ఉండు మరియు ఆ విగ్రహాన్ని తాకవద్దు' అని బిగ్గరగా అరిచేవాడు." ఆ తర్వాత, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) మళ్లీ ఏ బహుదేవతారాధన పండుగలోనూ పాల్గొనలేదు. మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రవక్త (స)ను అటువంటి విగ్రహారాధన ఆచారాల నుండి ఎల్లప్పుడూ కాపాడుతూ వచ్చాడు. (దలాయిలే-నబువ్వత్, బైహికి, సంపుటి 1, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరూట్, పేజీ. 138)

ఇది వారు (స) ప్రవక్తగా ప్రకటించుకోవడానికి ముందు జరిగిన సంఘటన. ప్రవక్త (స) బాల్యంలో, తన పిన్నాన్న అబూ తాలిబ్‌తో కలిసి సిరియాకు ప్రయాణిస్తున్నప్పుడు, బహీరా అనే ఒక క్రైస్తవ సన్యాసిని కలిశారు. బహీరా అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా అన్నారు, "లాత్ మరియు ఉజ్జా విగ్రహాల గురించి నన్ను అడగవద్దు. అల్లాహ్ మీద ప్రమాణం చేసి చెబుతున్నాను, ఈ విగ్రహాలను ద్వేషించినంతగా నేను మరేదానినీ ద్వేషించను." (దలాయిలే-నబువ్వత్, బైహిఖీ, సంపుటి 2, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరూట్, పేజీ 35)

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హజ్రత్ ఖదీజా (రజియల్లాహు అన్హా) గారి వ్యాపార సరుకులతో సిరియాకు ప్రయాణించినప్పుడు, వారు (స) ఆ సరుకులను అమ్మి ఇతర వస్తువులను కొనుగోలు చేశారు. ఈ ప్రయాణంలో, వారికి మరియు మరొక వ్యక్తికి మధ్య ఒక అభిప్రాయ భేదం తలెత్తింది. ఆ వ్యక్తి, "లాత్ మరియు ఉజ్జాల మీద ప్రమాణం చెయ్యి" అన్నాడు. మరో మాటలో చెప్పాలంటే, ఆ విగ్రహాల మీద ప్రమాణం చేస్తేనే తాను నిన్ను నమ్ముతానని పవిత్ర ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో చెప్పాడు. అందుకు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఇలా సమాధానమిచ్చారు, "నేను ఈ విగ్రహాలపై ఎన్నడూ ప్రమాణం చేయలేదు. నేను వాటి పక్కనుండి వెళ్ళినప్పుడు కూడా, నా ముఖాన్ని పక్కకు తిప్పుకుంటాను." అలాంటిది నీవు నన్ను ఆయా విగ్రహాలపై ప్రమాణం చేయమని అంటున్నావు. ఇది ఎలా సాధ్యమని దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అన్నారు. (అత్తబకాతుల్-కుబ్రా, సంపుటి 1, దారుల్ కుతుబుల్ ఇల్మియా, బీరుత్, పేజీ 124)

నేను ఇంతకుముందు చెప్పినట్లుగా, ఈ తౌహీద్‌ను సాధించే క్రమంలోనే దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) హిరా గుహకు వెళ్ళేవారు. వారి మనస్సు ఎల్లప్పుడు ఏకైక దేవుడిని ఆరాధించాలని మరియు ఆయన ఏకత్వాన్ని స్థాపించాలని తపించేది. హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజియల్లాహు అన్హు) గారు దానిని ఈ క్రింది విధంగా వర్ణించారు:

" హిరా గుహ, మక్కా నగరానికి సుమారు మూడు మైళ్ళ దూరంలో, పర్వతాల మధ్య ఉన్న హిరా అనే ప్రసిద్ధ పర్వతంలో ఉంది. నేడు దీనిని జబల్ అల్-నూర్ అని పిలుస్తారు. దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)కు మొదటి నుండి విగ్రహాల పట్ల విముఖత ఉండేది, కానీ విగ్రహాలను పూజిస్తూ ఏకైక దేవుడైన అల్లాహ్ నుండి దూరమైన వారి గురించి కూడా వారు ఎంతో ఆందోళన చెందేవారు. వారు స్వయంగా విగ్రహాలను పూజించకుండా ఉండటమే కాకుండా, అలా చేసే వారి గురించి కూడా చింతించేవారు. వారి అవతరణకు ముందు, వారు జనసాంద్రత గల ప్రాంతాల నుండి దూరంగా వెళ్ళి ఆ గుహలో ఆరాధన చేసేవారు.

దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నలభై ఏళ్ల వయస్సుకు చేరుకున్నప్పుడు, ఒక రోజు జిబ్రాయీల్ ప్రత్యక్షమయ్యారు. మరియు వారిపై మొదటి దైవవాణి అవతరించింది. దాని ద్వారా సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రవక్త (స)కు ఆజ్ఞాపించాడు. ఆ మొదటి దైవవాణితో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ప్రజలను అల్లాహ్ ఏకత్వం వైపు పిలవడం మరియు అన్యారాధనకు వ్యతిరేకంగా బోధించడం ప్రారంభించారు. అయితే, ప్రారంభంలో, ప్రవక్త (స) గారు తన సందేశాన్ని బహిరంగంగా ప్రకటించకుండా, వారు (స) నిశ్శబ్దంగా ముందుకు సాగారు మరియు తన బోధనను తన సన్నిహిత వర్గంలోని వారికి మాత్రమే పరిమితం చేశారు.

**(సిరాత్ ఖాతమున్ నబియ్యీన్, పేజీలు 117 - 120, ఫర్హంగే సిరాత్, పేజీ 101)**

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:

"మన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారు కోల్పోయిన సత్యాన్ని ప్రపంచంలోకి తిరిగి తీసుకువచ్చిన గొప్ప సంస్కర్త. యావత్ ప్రపంచం అంధకారంలో కూరుకుపోయి ఉండగా చూసి, దాని చీకటిని వెలుగుగా మార్చిన ఘనత మన ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు నల్లల్లాహు అలైహి వసల్లం కాకుండా మరే ప్రవక్తకూ లభించలేదు. అంతేకాదు, వారు ఏ సమాజం కోసం అవతరించబడినారో ఆ సమాజీకులందరు బహుదేవతారాధనను విడిచిపెట్టి, ఏకేశ్వరుడైన అల్లాహ్‌ను విశ్వసించే వరకు వారు (స) మరణించలేదు. అంతేకాదు, ఆ సమాజీకులు విశ్వాసంలో అత్యున్నత స్థాయిలను సాధించారు. ప్రపంచంలో మరెక్కడా కనిపించని అపూర్వమైన చిత్తశుద్ధి, విశ్వాసం మరియు నిశ్చయతను వారు ప్రదర్శించారు. హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం కాకుండా మరే దైవ ప్రవక్త కూడా ఇంతటి మరియు ఘనమైన విజయాన్ని సాధించలేదు.

దైవ ప్రవక్త (స) ప్రవక్తత్వానికి అనుకూలంగా ఉన్న ప్రధాన ఆధారం ఏమిటంటే, ప్రపంచం అంధకారంలో ఉన్న సమయంలో వారు (స) తన ఉనికితో ప్రపంచాన్ని అలంకరించారు." అంధకారంలో కూరుకుపోయి, ఒక గొప్ప సంస్కర్త యొక్క తీవ్రమైన అవసరం ఉన్న ఆ ప్రపంచంలో, లక్షలాది మంది ప్రజలు బహుదైవారాధన మరియు విగ్రహారాధనను విడిచిపెట్టి, ఏకేశ్వరవాదం మరియు సన్మార్గాన్ని స్వీకరించే వరకు వారు (స) మరణించలేదు. ఈ గొప్ప సంస్కరణను మన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) తప్ప మరెవరూ తీసుకురాలేక పోయేవారు. వారు (స) అనాగరికులుగా, ఆటవికముగా ఉన్న ప్రజలకు మానవ విలువలను బోధించారు. మరో మాటలో చెప్పాలంటే, వారు జంతువులను పోలి ఉన్న వారిని మనుషులుగా, మనుషులను నాగరిక మనుషులుగా, మరియు నాగరిక మనుషులను దైవభక్తి గల మనుషులుగా తీర్చిదిద్దారు. ప్రవక్త (స) వారిలో ఆధ్యాత్మిక గుణాలను నింపి, సత్య దేవునితో వారి ఐక్యతను స్థాపించారు. దైవ మార్గంలో, వారు మేకల వలె వధించబడ్డారు మరియు చీమల వలె తొక్కబడ్డారు, కానీ వారు తమ విశ్వాసాన్ని గట్టిగా పట్టుకొని, ప్రతి కష్టాన్ని ఎదుర్కొంటూ ముందుకు సాగారు. ప్రపంచంలో ఆధ్యాత్మికతను స్థాపించడం ద్వారా మన దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) నిస్సందేహంగా రెండవ ఆదం వంటివారు. నిజానికి, వారే అసలైన ఆదం, ఎందుకంటే వారి ద్వారానే సమస్త మానవ సద్గుణాలు పరిపూర్ణతను పొందాయి, సత్కార్య శక్తులన్నీ వాటి వాటి రంగాలలో క్రియాశీలమయ్యాయి, మరియు మానవ స్వభావంలోని ఏ శాఖ కూడా నిష్ఫలం కాలేదు. వారి వ్యక్తిత్వంలో ప్రవక్తత్వం యొక్క అంతిమత్వం, వారు చివరి కాలంలో అవతరించడంలోనే కాకుండా, ప్రవక్తత్వం యొక్క పరిపూర్ణతలన్నీ వారిలోనే పరిణమించడంతో పూర్తిగావించబడింది.

(సియాల్‌కోట్ ఉపన్యాసం, పుటలు 5-7)

మరోచోట, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:

"ఓ అల్లాహ్!, నిన్ను చేరే మార్గానికి మమ్మల్ని నడిపించినందుకు, మరియు నీ పవిత్ర గ్రంథాలను అవతరింపజేయడం ద్వారా ఆలోచన మరియు తర్కం యొక్క దోషాల నుండి మమ్మల్ని రక్షించినందుకు నీకు లెక్కలేనన్ని కృతజ్ఞతలు. ప్రవక్తల అధిపతి, హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లంను ఎన్నుకోబడిన వారు, వారి సంతతి మరియు వారి సహచరులపై మేము ఆశీస్సులు కోరుతున్నాము. వారి ద్వారా, అల్లాహ్ తాలా దారి తప్పిన యావత్ ప్రపంచాన్ని సరైన మార్గంలోకి నడిపించాడు. వారు (స), తప్పుదారి పట్టిన ప్రజలను తిరిగి సరైన మార్గంలోకి నడిపించిన గురువు మరియు ఉపకారి. ప్రజలను బహుదేవతారాధన మరియు విగ్రహాల శాపం నుండి విడిపించిన దయగల మరియు కరుణామయుడు. తౌహీద్ (అల్లాహ్ ఏకత్వం) యొక్క కాంతితో ప్రపంచాన్ని ప్రకాశింపజేసిన కాంతి మరియు తేజోప్రకారముడు. వ్యాధిగ్రస్త హృదయాలను సన్మార్గంలో నడిచేలా చేసిన స్వస్థత

పరిచినవాడు మరియు వైద్యుడు. అమృతంతో మృతులను బ్రతికించిన గొప్ప అద్భుతాలు చేసేవాడు, తన ఉమ్మత్ (ముస్లిం ప్రజల) కోసం బాధలను, దుఃఖాలను అనుభవించిన కరుణామయుడు మరియు దయామయుడు, మనల్ని మృత్యుముఖం నుండి రక్షించిన శౌర్యవంతుడు మరియు ధైర్యవంతుడు, తన ప్రభువు ముందు సంపూర్ణ విధేయతతో తలవంచి, తనను తాను పూర్తిగా త్యాగం చేసుకున్న వినయశీలి మరియు నిస్వార్థపరుడు, దైవ ఏకత్వాన్ని సంపూర్ణంగా విశ్వసించి, జ్ఞాన సముద్రంలా ఉన్నవాడు, దైవ వైభవం తప్ప మరేదానికీ భయపడకుండా, అల్లాహ్ మినహా మిగతావన్నీ విలువలేనివిగా భావించినవాడు, మరియు నిరక్షరాస్యుడైనప్పటికీ, దైవజ్ఞానం విషయంలో అందరినీ మించి, అన్ని జాతుల వారు అనుభవించిన బాధలకు కారణమైన తప్పులను, లోపాలను వారికి తెలియజేసిన దైవశక్తి యొక్క అద్భుతం." (బరాహిన్-ఎ-అహ్మదియ్య, భాగం 1, సంపుటి 1, పేజి 17)

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా వ్రాశారు:

"తౌహీద్, దాని స్వచ్ఛమైన రూపంలో, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరులలో తప్ప భూమిపై ఉన్న ఏ ప్రజలలోనూ కనిపించదు." మరియు పవిత్ర ఖురాన్ తప్ప, భూమిపై మరే గ్రంథం కూడా లక్షలాది మందిని ఈ పవిత్ర సిద్ధాంతానికి దృఢంగా కట్టుబడి ఉండేలా చేయలేదు మరియు మానవాళిని ఏకైక సత్య దేవుని వైపు ఇంత భక్తిశ్రద్ధలతో నడిపించదు. ప్రతి మతానికి చెందిన ప్రజలు తమ కోసం కృత్రిమ దేవుళ్లను సృష్టించుకున్నారు, అయితే ముస్లింల దేవుడు ఏకేశ్వరుడు, శాశ్వతుడు మరియు మార్పులేనివాడు, ఆయన గుణాలు పూర్వం ఎలా ఉన్నాయో నేటికీ అలాగే ఉన్నాయి.

(బరాహిన్-ఎ-అహ్మదీయ్యా, భాగం 2, సంపుటి 1, పేజి 117-118)

కాని ఎంత విచారకరం!. ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) సమాజీకులు కూడ తౌహీద్ వాస్తవాన్ని మరచిపోతున్నారు. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ బోధించిన రీతిలో, మరియు దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఎంతో వేదన మరియు మార్గదర్శకత్వంతో వారిలో నింపిన నిజమైన తౌహీద్ ఇప్పుడు వారిలో మిగలలేదు. స్వచ్ఛమైన తౌహీద్‌ను నిర్లక్ష్యం చేయడం వల్ల, ఒక నిజమైన ముస్లింకు ఉండవలసిన లక్షణాలలో ఒకటైన సర్వశక్తిమంతుడైన అల్లాహ్ గుణాలపై విశ్వాసం కల్గియుండడం కూడా బలహీనపడింది. ఇలాంటి పరిస్థితులలో, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క నిజమైన శిష్యున్ని అనుసరిస్తున్నామని చెప్పుకునే వారు తౌహీద్ యొక్క వాస్తవికతను అర్థం చేసుకోవడం మరియు దాని కోసం తమలో తాము ప్రత్యేకమైన మార్పులను తీసుకురావడం వారి కర్తవ్యం. ఇది ఆరాధనకు అంకితమైన రమజాన్ మాసం, మరియు ఈ మాసంలో ఈ లక్ష్యం కోసం ప్రత్యేక ప్రయత్నం చేయాలి మరియు ప్రత్యేక దుఆలు చేయాలి.

మనం ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పట్ల ప్రేమను కలిగి ఉన్నామని చెప్పుకుంటే, వారు(స) తమ జీవితాంతం ఆచరించినట్లే, మనం కూడా తౌహీద్ స్థాపన కోసం తీవ్రంగా కృషి చేయాలి.

అల్లాహ్ ఆజ్ఞ మేరకు మరియు అల్లాహ్ దైవ ఏకత్వాన్ని స్థాపించే ప్రయత్నంలో ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనేక కష్టాలను, బాధలను సహించారు. దీనిని వివరిస్తూ, హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌవూద్ (రజి) ఒక సందర్భంలో ఇలా పేర్కొన్నారు:

"పవిత్ర ఖురాన్‌లో, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ దైవ ప్రవక్త (స)తో ఇలా సెలవిస్తున్నాడు: అన్‌జిర్ అషీరతకల్ అఖ్‌రబీన్. అనగా ఓ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నీవు ప్రపంచంలోని ప్రతి మూలలో ఉన్న ప్రజలను హెచ్చరించు, కానీ మొదట నీ సొంత బంధువులను హెచ్చరించు. ఎందుకంటే మీరు వారికి ఇవ్వవలసిన హక్కులు రెండు రకాలుగా ఉన్నాయి: ఒకటి, మిగతా ప్రపంచంలాగే వారూ నశించిపోతున్నారు; రెండవది, వారు మీ బంధువులు, మరియు వారి పూర్వీకులు ఒకప్పుడు మీ పట్ల దయతో ప్రవర్తించారు. దానం ఇంటి నుంచే మొదలవుతుంది' అనే ఒక ప్రసిద్ధ ఆంగ్ల సామెత కూడా ఉంది. అంటే, దానం మరియు దానధర్మాలు మన సొంత ఇంట్లోనే మొదలవుతాయి. అదేవిధంగా, హెచ్చరిక మరియు ఉపదేశ ప్రక్రియ కూడా ఎల్లప్పుడూ ఇంట్లోనే ప్రారంభం కావాలి. తదనుసారం, దైవ ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ఈ ఆజ్ఞను ఈ విధంగా నెరవేర్చారు: మక్కా ఆచారం ప్రకారం, వారు (స) సఫా పర్వతం మీద నిలబడి వివిధ తెగల పేర్లను పిలవడం ప్రారంభించారు. మొదటగా, వారు(స) ఆల్-ఎ-ఘాలిబ్ తెగను పిలిచారు, మరియు వారు పవిత్ర మసీదు నుండి బయటకు వచ్చి సఫా పర్వతం క్రింది భాగంలో సమావేశమయ్యారు. ఆ క్షణంలో అబూ లహబ్ దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం)తో ఇలా అన్నారు, 'ఆల్-ఎ-ఘాలిబ్ తెగ వచ్చింది; మీరు చెప్పాలనుకున్నది ఏదైనా చెప్పండి.' దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) అతని వ్యాఖ్యను ఏమాత్రం పట్టించుకోకుండా లూయీ తెగను పిలిచారు. వారు వచ్చినప్పుడు, అబూ లహబ్ మళ్ళీ ఇలా అన్నాడు, 'ఇప్పుడు లూయీ తెగ కూడా వచ్చింది కాబట్టి, మీరు ఏమి చెప్పాలనుకుంటున్నారో మాకు చెప్పండి.' అయినప్పటికీ, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) ఆ మాట వైపు శ్రద్ధ చూపకుండా ఆల్-ఎ-ముర్రా తెగను పిలిచారు, వారు కూడా వచ్చారు."అప్పుడు ప్రవక్త (స) ఆల్-ఎ-కిలాబ్ మరియు ప్రజలందరూ సమావేశమయ్యే వరకు ఆల్-ఎ-ఖుసయ్య తెగ వారు సమావేశమయ్యారు. స్వయంగా రాలేకపోయిన వారు, ఆ రోజు వారు ఎందుకు సమావేశమయ్యారో తిరిగి తెలియజేయడానికి దూతలను పంపారు. ఖురైష్ తెగతో సహా మక్కాలోని అన్ని తెగల వారు సమావేశమైనప్పుడు, దైవ ప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) వారిని ఉద్దేశించి ప్రసంగించడం ప్రారంభించి ఇలా అన్నారు: "చెప్పండి, ఈ పర్వతం వెనుక మీపై దాడి చేయడానికి ఒక పెద్ద సైన్యం సమావేశమైందని నేను మీకు తెలియజేస్తే, మీరు నన్ను నమ్ముతారా?" అందుకు వారు, 'తప్పకుండా!' అని బదులిచ్చారు. 'మేము నిస్సందేహంగా మిమ్మల్ని విశ్వసిస్తాము; ఎందుకంటే మీరు ఎల్లప్పుడూ నిజాయితీపరులని, సత్యవంతులని మాకు తెలుసు. "మక్కా పరిస్థితులతో పరిచయం ఉన్నవారికి ఒక విషయం తెలుసు: దైవ ప్రవక్త (స) అడిగిన ఈ ప్రశ్న, వాస్తవానికి వారిని ఒక అసంభవమైన విషయాన్ని అంగీకరించమని కోరడం లాంటిదే. మక్కావాసుల పశువులు ఆ లోయలో మేసేవి; ఒక సైన్యం దాగి ఉండటం అనేది ఆ ప్రాంతంలో పూర్తిగా అసంభవమైన విషయం. అయినప్పటికీ, వారి సత్యసంధత పట్ల వారికున్న నమ్మకం ఎంత దృఢమైనదంటే, వారు ఇలా ప్రకటించారు: 'మా కళ్ళతో మేము దానిని నిర్ధారించుకోలేకపోయినా సరే, మేము మిమ్మల్ని విశ్వసిస్తాము. ఎందుకంటే మా దృష్టిలో మీ సత్యసంధత సందేహాలకు అతీతమైనది. వారు "దైవ ప్రవక్త (స.అ.స) పట్ల ఇలా ఏకగ్రీవంగా ఈ విశ్వాసాన్ని, నమ్మకాన్ని వ్యక్తం చేసినప్పుడు," ప్రవక్త (స) ఇలా అన్నారు.

"అయితే వినండి. నేను మీకు ఒక ముఖ్యమైన ప్రకటనను తీసుకువచ్చాను. సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ప్రమాణం!, ఆయన దూతగా నేను పంపబడ్డాను. కాబట్టి నేను మీకు చెబుతున్నాను: మీరు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ శిక్ష నుండి రక్షణ పొందాలనుకుంటే, నన్ను అనుసరించండి.' ప్రవక్త (స) ఈ మాటలు చెప్పగానే, అబూ లహబ్ ఆగ్రహంతో ఇలా అరచాడు. తబ్బన్ లక సాఇరల్ అయ్యామి అలి హాజ జమఅతనా అనగా , నవూజుబిల్లాహ్ 'నీకు నాశనం కలుగుగాక! మమ్మల్ని సమావేశపరిచింది దీని కోసమేనా?' అలాగే, మిగిలిన వారు కూడా అక్కడి నుండి చెల్లాచెదురవుతూ నవ్వడం, ఎగతాళి చేయడం ప్రారంభించారు."

(తఫ్సీర్-ఎ-కబీర్, సంపుటి 9, పేజీలు 582-583, 2023)

అయినప్పటికీ, ఈ ఎగతాళి మరియు వ్యతిరేకత, దైవ ఏకత్వాన్ని స్థాపించే కృషి నుండి దైవ ప్రవక్త (స)ను ఏమాత్రం వెనక్కి తగ్గించలేకపోయాయి. వారు (స) ఈ ప్రయత్నంలో స్థిరచిత్తంతో ముందుకు సాగారు. నేను ఇంతకుముందు పేర్కొన్నట్లుగా, ఎగతాళి మొదలైంది, మరియు వ్యతిరేకత మరింత తీవ్రమైంది. ఈ వ్యతిరేకతను హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహిబ్ (రజి), చారిత్రక గ్రంథాల ఆధారంగా ఈ క్రింది విధంగా వర్ణించారు:

" ఎంతటి గొప్ప లక్ష్యసాధనను దైవ ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తీసుకవచ్చారో అంతే తీవ్రతతో ప్రవక్త (స)ను వ్యతిరేకించ వలసింది. ఎందుకనగా పూర్తి అంధాకారం ఆవరించి ఉన్న యుగంలో ప్రవక్త (స) అవతరించారు. కావున వెలుగు వెలుగొందుతున్నప్పుడు చీకటి సైన్యాలు తమ శక్తిమేర పోరాడటం అనివార్యమై ఉండెను. కావున అలాగే జరిగింది. గతంలోని ప్రవక్తలందరితో పోలిస్తే, దైవ ప్రవక్త (స.అ.) అత్యధిక వ్యతిరేకతను ఎదుర్కొన్నారు. ఈ వ్యతిరేకతకు గల ప్రాథమిక కారణాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:........ మొదటగా, ఖురైష్ ప్రజలు అత్యంత తీవ్రమైన విగ్రహారాధకులు. విగ్రహాల పట్ల గౌరవం మరియు ప్రేమ వారి హృదయాలలో ఎంతగా నాటుకుపోయాయంటే, వాటికి వ్యతిరేకంగా ఒక్క మాట వినడం కూడా వారికి భరించరానిదిగా ఉండేది. ఈ దుర్మార్గులు, కేవలం సర్వోన్నతుడైన అల్లాహ్ ఆరాధన కోసమే నిర్మించబడిన కాబాలో వందలాది విగ్రహాలను ప్రతిష్టించారు. వారు తమ అవసరాలన్నింటి కోసం ఈ విగ్రహాలనే ఆశ్రయించేవారు. ఇస్లాం వచ్చినప్పుడు, దాని ప్రధాన పునాది దేవుని ఏకత్వం. ఏ మనిషి ముందుగాని, చెట్టు, రాయి లేదా నక్షత్రం మొదలైన వాటి ముందు గాని తల వంచరాదు అనేది దాని స్పష్టమైన ఆజ్ఞ. అనగా వస్‌జుదూ లిల్లాహిల్లజి ఖలఖహున్న.అర్థం: సకల చరాచర జీవములన్నింటిని సృష్టించిన అల్లాహ్ ముందు మాత్రమే సాష్టాంగం చేయండి.' ( ఫుస్సిలత్, :38) "అంతేకాకుండా, పవిత్ర ఖురాన్‌లో ఖురైష్ వారి విగ్రహాలను వర్ణించడానికి ఉపయోగించిన పదాలు ఖురైష్ వారికి చాలా అవమానకరంగా అనిపించాయి, ఎందుకంటే అవి నరకానికి ఇంధనంగా ప్రకటించబడ్డాయి .... ఈ వ్యాఖ్యలు ఖురైష్ ప్రజలలో నిప్పు రగిలించాయి, మరియు వారు ఇస్లాంను నాశనం చేయడానికి ఏకమై నిలబడ్డారు."

(సీరత్ ఖాతమున్నబియ్యీన్ (స)పేజి 132-133)



ఇంకా అనేక ఇతర కారణాలు కూడా ఉన్నాయి, కానీ ఇది ఒక ప్రధానమైనది.

హజ్రత్ అఖ్దస్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇలా పేర్కొన్నారు:

"ఒక ప్రవక్త లేదా సందేశహరుడు దేవుని నుండి వచ్చినప్పుడు, అతని అనుచరులు ఆశాజనకంగా, సత్యంగా, నీతిగా మరియు వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉన్న ప్రగతిశీల సమూహంగా భావించబడతారు. అప్పటికే ఉన్న సమాజాలు మరియు మత వర్గాలు అనివార్యంగా వారి పట్ల ఒక విధమైన కోపాన్ని మరియు అసూయను పెంచుకోవడం ప్రారంభిస్తాయి. మత నిపుణులు మరియు నాయకులు అటువంటి భావాలను వ్యక్తపరచడంలో ప్రత్యేకంగా ముందుంటారు, ఎందుకంటే దైవజనుడి రాక వారి ఆదాయాలు మరియు ప్రతిష్టలో మార్పుకు దారి తీస్తుంది. వారి విద్యార్థులు మరియు శిష్యులు తమ ఉచ్చు నుండి బయటపడటం ప్రారంభిస్తారు, ఎందుకంటే వారు దేవుని నుండి వచ్చిన వ్యక్తిలో విశ్వాసం, నైతికత మరియు జ్ఞానం యొక్క అన్ని ఉత్తమ లక్షణాలను గమనిస్తుంటారు. (ఇతర మత నాయకుల యొక్క నీతిమంతులు, సత్ప్రవర్తన గల అనుచరులు దైవజనుని వైపు ఆకర్షితులవుతారు.) అందువల్ల, వివేకం, విచక్షణ కలిగిన వారు, ఈ పండితులు విద్యాభ్యాసం, భక్తి, నిగ్రహం ఆధారంగా ఇంతకుముందు పొందిన గౌరవానికి అర్హులు కారని గ్రహిస్తుంటారు. నజ్మ్-ఉల్-ఉమ్మహ్ (జాతి నక్షత్రం), షమ్స్-ఉల్-ఉమ్మహ్ (జాతి సూర్యుడు), షేక్-ఉల్-మషాయిఖ్ (గౌరవనీయుల నాయకుడు) వంటి ఉన్నతమైన బిరుదులు ఇకపై వారికి నిలువవు. తమ విశ్వాసాన్ని కోల్పోవడానికి ఇష్టపడని వివేకవంతులు, ఇలాంటి పండితుల నుండి ముఖం తిప్పుకుంటారు (ఇవి స్వచ్ఛమైన స్వభావం గల విశ్వాసుల చర్యలు.) "పైన పేర్కొన్న నష్టాల కారణంగా మత పండితులు మరియు పితృపురుషులు ఎల్లప్పుడూ దైవ ప్రవక్తలు మరియు దూతల పట్ల అసూయతో నిండి ఉంటారు. వాస్తవానికి, ఈ వర్గానికి చెందిన సభ్యులు లోపభూయిష్టులు. వారిలో దైవిక కాంతి చాలా తక్కువగా ఉంటుంది, మరియు ఒక ప్రవక్త లేదాసందేశహరుని కాలంలో వారి లోపాలు పూర్తిగా బయట పడతాయి. వారి అహం దైవ ప్రవక్తలు మరియు సజ్జనుల పట్ల శత్రుత్వాన్ని రేకెత్తిస్తుంది, మరియు వారు స్వార్థపూరితంగా వారికి హాని చేయడానికి ప్రణాళికలు రచిస్తారు. అలాంటి వ్యక్తులు, దేవుని స్వచ్ఛమైన హృదయం గల వ్యక్తిని అన్యాయంగా హింసించడం ద్వారా తాము దేవుని ఆగ్రహానికి గురయ్యామని కొన్నిసార్లు తమ హృదయాలలో కూడా తెలుసుకుంటారు. సజ్జనుల పట్ల వారి సహజ సిద్ధమైన చర్యలు వారి మనస్సుకు దోషాలుగా కనిపించవు. మరియు వారి అసూయ అనే అగ్ని, వేగవంతమైన రైలులా కదులుతూ, వారిని ద్వేషమనే అగాధం వైపు నెట్టివేస్తుంది. "వారిలోని ఈ కారణాలే, దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కాలంలోకూడ, అన్యమతస్థులను, యూదులు మరియు క్రైస్తవ పండితులను వ్యతిరేకించేలా, సత్యాన్ని స్వీకరించకుండా నిరోధించారు. అందువల్ల, వారు భూమిపై నుండి ఇస్లాంను తుడిచి పెట్టాలని కోరుకున్నారు. ఇస్లాం ప్రారంభ కాలంలో ముస్లింలు చాలా తక్కువ సంఖ్యలో ఉన్నందున, సంపద, ఆస్తి, సంఖ్య, గౌరవం మరియు హోదా పరంగా ఒక కొత్త మతాన్ని అనుసరించేవారి కంటే, తామే ఉన్నతమైనవారమని భావించే వారి మనస్సులలో సహజంగా ఉండే అహంకారం కారణంగా, వారి ప్రత్యర్థులు వారి పట్ల తీవ్రమైన శత్రుత్వాన్ని ప్రదర్శించారు. ఈ దివ్యమైన మొక్క (ఇస్లాం) యొక్క వేళ్లు భూమిలోకి పాతుకుపోవడం వారికి ఇష్టం లేదు, పైగా ఈ సజ్జనులను నాశనం చేయడానికి తమ సర్వశక్తులతో పోరాడారు. ఈ మతం యొక్క దృఢమైన స్థాపన, తమ విశ్వాసానికి మరియు జాతికి వినాశన బీజాలు నాటుతుందని వారు భయపడ్డారు. వారి హృదయాలలో గాఢంగా నాటుకుపోయిన ఈ భయం కారణంగా, వారు అత్యంత దుర్మార్గమైన మరియు క్రూరమైన చర్యలకు పాల్పడి, అనేక మంది ముస్లింలను దారుణంగా హత్య చేశారు.

సుదీర్ఘమైన పదమూడు సంవత్సరాల వరకు కూడ వారి పద్ధతులు మారలేదు. మానవాళికే గౌరవప్రదమైన దేవుని విశ్వాసులలో చాలామంది, ఈ అనాగరికుల ఖడ్గాలచే క్రూరంగా ముక్కలు చేయబడ్డారు. అనాథలు, బలహీనులైన, నిస్సహాయులైన స్త్రీలు వీధులలోనూ, సందులలోనూ వధించబడ్డారు. అయినప్పటికీ, కీడుకు ప్రతిదాడి చేయరాదని దేవుడు ఆజ్ఞాపించాడు. నీతిమంతులైన, దేవునిచే ఎన్నుకోబడిన ఈ ప్రజలు ఆ ఆజ్ఞను ఖచ్చితంగా పాటించారు. వీధులు వారి రక్తంతో ఎర్రబడగా, వారు ఒక్క మాట కూడా మాట్లాడలేదు. వారు జంతువులవలె వధించబడ్డారు కానీ నిరసన తెలపలేదు.

(బ్రిటిష్ ప్రభుత్వం మరియు జిహాద్, పేజీలు 4-6)

మక్కాలోని అవిశ్వాసులు, ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం తీసుకువచ్చిన తౌహీద్ (అల్లాహ్ ఏకత్వం) సందేశాన్ని వ్యాప్తి చేయకుండా నిరోధించడానికి ప్రయత్నించారు. కొన్నిసార్లు వారు ప్రవక్త (స)ను బెదిరించారు, మరికొన్ని సార్లు వారిని ప్రలోభపెట్టడానికి ప్రయత్నించారు. అయినప్పటికీ ప్రవక్త (స) సమాధానం ఎల్లప్పుడూ ఒకే విధముగా ఉండేది. ప్రపంచంలో అల్లాహ్ ఏకత్వాన్ని స్థాపించడమే తన జీవిత పరమార్థం అని మరియు ఈ కారణం చేతనే సర్వశక్తిమంతుడైన అల్లాహ్ తనను అవతరింపచేశాడని ప్రవక్త (స) చెప్పేవారు.

ఈ విషయంలో, హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌవూద్ (రజి) ఒక చోట ఇలా వ్రాశారు:

"ఒకవైపు వ్యతిరేకత తీవ్రమైనది. మరోవైపు, దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం మరియు వారి సహచరులు గొప్ప పట్టుదలతో మక్కా ప్రజలకు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ యొక్క సందేశాన్ని తెలియజేయడం ప్రారంభించారు. ఈ ప్రపంచ సృష్టికర్త ఒక్కడే, ఆయన తప్ప మరెవరూ ఆరాధనకు అర్హులు కారు. గతంలోని ప్రవక్తలందరూ అల్లాహ్ ఏకత్వానికి సాక్ష్యమిచ్చారు మరియు తమ తమ ప్రజలను ఈ బోధనల వైపే పిలిచారు." ఏకేశ్వరుడైన అల్లాహ్‌ను విశ్వసించండి మరియు ఈ రాతి విగ్రహాలను విడిచిపెట్టండి, ఎందుకంటే అవి పూర్తిగా నిరుపయోగమైనవి మరియు ఎటువంటి శక్తి లేనివి. ఓ మక్కా వాసులారా! వారి ముందు నైవేద్యాలు ఉంచినప్పుడు, ఈగలు గుంపులు గుంపులుగా వారిపై వాలినప్పుడు, ఆ ఈగలను తోలివేసే శక్తి కూడా వాటికి లేదని మీరు చూడడం లేదా? ఎవరైనా వాటిపై దాడి చేస్తే, అవి తమను తాము రక్షించుకోలేవు. ఎవరైనా వాటిని ప్రశ్నిస్తే, అవి సమాధానం ఇవ్వలేవు. ఎవరైనా వాటిని సహాయం కోరితే, అవి వారికి సహాయం చేయలేవు. కానీ ఆ ఏకేశ్వరుడైన అల్లాహ్ మాత్రం తనను ప్రార్థించే వారి అవసరాలను తీరుస్తాడు. తనను అడిగేవారికి ఆయన సమాధానమిస్తాడు. తన సహాయం కోరేవారికి ఆయన సహాయం చేస్తాడు. ఆయన తన శత్రువులను అణచివేసి, తన భక్తులకు ఉన్నతమైన పురోగతిని ప్రసాదిస్తాడు. ఆయన నుండి వెలువడే కాంతి ఆయన భక్తుల హృదయాలను ప్రకాశింపజేస్తుంది. "అలాంటప్పుడు మీరెందుకు అటువంటి దేవుడిని విడిచిపెట్టి, ప్రాణం లేని విగ్రహాల ముందు తలవంచి, మీ జీవితాలను వృధా చేసుకుంటున్నారు?. దైవ ఏకత్వాన్ని విడిచిపెట్టడం వల్ల మీ ఆలోచనలు అపవిత్రమై, మీ హృదయాలు అంధకారమయం అయ్యాయని మీరు తెలుసుకోవడంలేదా? మీరు అన్ని రకాల మూఢనమ్మకాలలో పడిపోయారు (వారు తౌహీద్‌ను విడిచిపెట్టిన కారణంగా మూఢనమ్మకాలలో పడిపోయారు)." మీరు దైవ ఏకత్వాన్ని విడిచిపెట్టి నందువల్ల మీ హృదయాలలో భ్రమలు కలుగుతున్నాయి. మీరు ధర్మబద్ధమైనది, ధర్మవిరుద్ధమైనది అనే భేదాన్ని ఇకపై గుర్తించడం లేదు. మీరు మంచి చెడుల మధ్య తేడాను గ్రహించలేక పోతున్నారు. మీరు మీ తల్లులను అవమానిస్తున్నారు, మీ సోదరీమణులను, కుమార్తెలను అణచివేస్తున్నారు మరియు వారికి చెందవలసిన హక్కులను ఇవ్వడం లేదు. మీ భార్యల పట్ల మీ ప్రవర్తన భయంకరంగా ఉంది. మీరు అనాథల ఆస్తులను దోచుకుంటున్నారు మరియు వితంతువులతో కఠినంగా వ్యవహరిస్తున్నారు. మీరు పేదలను, బలహీనులను అణచివేస్తున్నారు మరియు ఇతరుల హక్కులను అపహరించి, మీ స్వీయ గొప్పతనాన్ని స్థాపించుకోవాలని చూస్తున్నారు. అసత్యం పలకడం, మోసం చేయడంలో మీకు సిగ్గు కలగడం లేదు. దొంగతనం, దోపిడీ పట్ల మీకు విముఖత కలగడం లేదు. జూదం మరియు మద్యపానం మీ కాలక్షేపాలు. మీరు జ్ఞాన సముపార్జనపైన గానీ, దేశ సేవపైన గానీ శ్రద్ధ చూపడం లేదు. ఏకేశ్వరుడైన అల్లాహ్ పట్ల మీరు ఇంకెంతకాలం నిర్లక్ష్యంగా ఉంటారు? రండి!, మిమ్మల్ని మీరు సంస్కరించుకోండి, మరియు అన్యాయాన్ని విడిచిపెట్టండి. తమలో పాతుకుపోయిన ఈ దురాచారాలను మీరు సంస్కరించుకోండి!.

ప్రజలు దైవ ఏకత్వానికి దూరమవడం వలనే, నేడు ఇటువంటి

**131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్**

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 131 వ జల్సా సాలానా (వార్షిక సభ) ఖాదియాన్ కొరకు 25, 26,27 డిశంబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. ఇప్పటి నుండే జమాఅత్ సభ్యులు ఈ పవిత్ర సభలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంభించగలరు. ఈ ఆధ్యాత్మిక సభతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక మహాసభ అన్ని విధాలా విజయవంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

(నజారత్ ఇస్లాహ్ విర్షాద్ దక్షిణ భారత దేశపు ఖాదియాన్)

**లజ్నా ఇమాఉల్లాహ్ వార్షిక సమావేశాలు ఖాదియాన్**

సయ్యద్నా హజ్రత్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ గారు లజనా ఇమాఉల్లాహ్, నాసిరాతుల్ అహ్మదియ్యకు చెందిన వార్షిక సమావేశాలు ఖాదియాన్ కొరకు 23, 24, 25 అక్టోబర్ 2026 (శుక్రవారం, శనివారము, ఆదివారము) తేదీలను ఆమోదించినారు. కావున నేటి నుండే ఈ పవిత్ర సమావేశాలలో పాల్గొనుటకు సంకల్పించి సన్నాహాలు ప్రారంబి ంచగలరు. ఈ ఆధ్యాత్మిక సమావేశాలతో ప్రయోజనము పొందే అనుగ్రహము అల్లాహ్ మనందరికి కలిగించుగాక! ఈ వార్షిక సమావేశాలు అన్ని విధాలా విజయ వంతమగుటకు, దీని ద్వారా సత్యవంతులు మార్గదర్శనము పొందాలని ప్రార్థనలు చేయగలరు. అల్లాహ్ అందరికి ఉత్తమ ప్రతి ఫలములు అందించు గాక!

దురాచారాలతో బాధపడుతున్నారు, వేదనకు గురవుతున్నారు. ఏయే జాతులలో ఇటువంటి దుర్గుణాలు ఉన్నాయో, ఒకవేళ వారిలో ఒకటి రెండు సద్గుణాలు మిగిలి ఉన్నా, పైన పేర్కొన్న అనేక దుర్గుణాలు వారిలో ఉన్నాయి, వాస్తవానికి ఆయా జాతులు దైవ ఏకత్వానికి దూరం కావడమే అందుకు గల ప్రధాన కారణం. దురదృష్టవశాత్తు, కొంతమంది ముస్లింల పరిస్థితి కూడా ఇలాగే ఉంది.

హజ్రత్ ముస్లేహ్-ఎ-మౌవూద్ (రజి) దైవ సామీప్యాన్ని పొందే మార్గం ఇదేనని ఇలా పేర్కొన్నారు:

"ప్రతి న్యాయవంతునికి అతని హక్కును ఇవ్వాలి. (ఇది ఒక ముఖ్యమైన విషయం.) దేవుడు సంపదను ప్రసాదించినట్లయితే, దానిని మీ దేశ, జాతి సేవ కోసం మరియు బలహీనులు, పేదల అభ్యున్నతి కోసం ఖర్చు చేయండి. స్త్రీలను గౌరవించండి మరియు వారి హక్కులను నెరవేర్చండి. అనాథలను సర్వశక్తిమంతుడైన అల్లాహ్ నుండి వచ్చిన అమానత్‌గా (న్యాసంగా) భావించండి మరియు వారిని పోషించడాన్ని అత్యున్నతమైన పుణ్యంగా పరిగణించండి. వితంతువులకు అండగా నిలవండి. ధర్మాన్ని, భక్తిని నెలకొల్పండి. న్యాయం మరియు నిష్పక్షపాతాన్ని , కేవలం న్యాయం మాత్రమే కాదు, కరుణ మరియు దయలను కూడా మీ విశిష్ట గుణాలుగా అవర్చుకోండి. (కేవలం న్యాయం మాత్రమే సరిపోదు; కరుణ మరియు దయ కూడా ఉండాలి. ఇదే ఒక నిజమైన విశ్వాసికి బోధించబడింది.)" ఈ లోకంలో మీ జీవితం వృధా కాకూడదు. శాశ్వతమైన సద్గుణ బీజం నాటబడేలా, గొప్ప వారసత్వాలను వదిలి వెళ్ళండి. నిజమైన గౌరవం కేవలం హక్కులను పొందడంలో లేదు, అది త్యాగం మరియు నిస్వార్థతలో ఉంది. (మీ హక్కులను పొందడానికి మాత్రమే ప్రయత్నించకండి; ఇతరుల హక్కులను చెల్లించడం కోసం త్యాగం, నిస్వార్థత కూడా అవసరం.) కాబట్టి, త్యాగాలు చేసి దేవునికి దగ్గరవ్వండి. దైవ సేవకుల ముందు నిస్వార్థతకు అత్యున్నత ఉదాహరణగా నిలవండి, తద్వారా దేవుని దృష్టిలో మీ హక్కులు స్థాపించబడతాయి."

ఇవి సత్యమైన తౌహీద్‌పై స్థిరంగా నిలబడటానికి సంకేతాలు. "నిశ్చయంగా, మనం బలహీనులమే, అయినప్పటికీ మనం మన బలహీనతలకే అంటిపెట్టుకుని ఉండవద్దు. (ఇదే దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) కూడా ప్రకటించారు.) సత్యం యొక్క సార్వభౌమాధికారం కోసం స్వర్గంలో శాసనం జారీ చేయబడింది. ఇప్పుడు, అల్లాహ్ యొక్క సందేశవారుడైన ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) ద్వారా, న్యాయపు త్రాసు స్థాపించబడుతుంది, మరియు న్యాయం, కరుణలతో కూడిన ప్రభుత్వం స్థాపించబడుతుంది, అందులో ఎవరికీ అన్యాయం జరగదు. మత విషయాలలో ఎటువంటి జోక్యం ఉండదు. స్త్రీలు మరియు బానిసలపై జరిగే అన్యాయాలు నిర్మూలించబడతాయి, మరియు షైతాన్ ఆధిపత్యం స్థానంలో, ఏకేశ్వరుడైన అల్లాహ్ సార్వభౌమాధికారం స్థాపించబడుతుంది.

"ఈ బోధనలు మక్కా ప్రజలకు పదేపదే ప్రకటించబడటం ప్రారంభమైనప్పుడు, మరియు సత్ప్రవర్తన గల వ్యక్తులు ఇస్లాం వైపు మొగ్గు చూపడం మొదలు పెట్టినప్పుడు, ఒక రోజు మక్కా అధిపతులు సమావేశమై ప్రవక్త (స) పిన్నాన్న అయిన అబూ తాలిబ్ వద్దకు వెళ్లారు. వారు అతనితో ఇలా అన్నారు: "మీరు మా నాయకుడు, మీ పట్ల ఉన్న గౌరవం వలన, మేము ఇప్పటి వరకు మీ సోదరుడి కుమారుడు ముహమ్మద్ (స)ని ఏమీ అనలేదు. కానీ ఇప్పుడు ఒక తుది నిర్ణయం తీసుకోవలసిన సమయం వచ్చింది. మీరు అతనికి నచ్చజెప్పి, అతను మా నుండి అంతిమంగా ఏమి కోరుకుంటున్నాడో తెలియజేయండి!. ఒకవేళ "అతను గౌరవం, మర్యాద కోరుకుంటే, మేము అతన్ని మా నాయకుడిగా నియమించుకోవడానికి సిద్ధంగా ఉన్నాము. అతను సంపదను కోరుకుంటే, మాలో ప్రతి ఒక్కరం మా సంపదలో కొంత భాగాన్ని అతనికి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాము. అతను వివాహం కోరుకుంటే, మక్కాలో తనకు నచ్చిన ఏ స్త్రీ పేరునైనా చెప్పనివ్వండి, మేము ఆమెతో అతని వివాహాన్ని జరిపించేస్తాము. దానికి బదులుగా, మేము అతనిని ఏమీ అడగము మరియు మరే ఇతర విషయంలోనూ మేము అతన్ని అడ్డుకోము. కాని మేము కోరేది ఒక్కటే, అతను మా విగ్రహాలను దూషించడం మానుకోవాలి. అతను కోరుకుంటే, దేవుడు ఒక్కడే అని ప్రకటించవచ్చు; కానీ మా విగ్రహాలు అసత్యమైనవని చెప్పకూడదు. అతను ఈ ఒక్క షరతును అంగీకరిస్తే, అతనికి, మాకు మధ్య సయోధ్య కుదురుతుంది. మీరు అతనికి నచ్చజెప్పి, మా ప్రతిపాదనను అంగీకరించేలా ఒప్పించాలి. లేకపోతే, రెండు మార్గాలలో ఒకటి మీకు మిగులుతుంది: మీరు మీ సోదరుడి కుమారుడిని వదులుకోవలసి వస్తుంది, లేదా మీ ప్రజలు మీ పట్ల తమ విధేయతను ఉపసంహరించుకుని, మీ నాయకత్వాన్ని నిరాకరిస్తారు. ఈ విషయం అబూ తాలిబ్‌కు అత్యంత భారంగా అనిపించింది. అరబ్బుల వద్ద సంపద చాలా అరుదుగా ఉండేది. కాని వారి నిజమైన గర్వం మరియు ఆనందం వారి తెగకు నాయకత్వం వహించడంలో మరియు వారిని గౌరవించడంలోనే ఉండేవి. నాయకులు తమ ప్రజల కోసం జీవించే వారు, మరియు ప్రజలు తమ నాయకుల కోసం జీవించే వారు. ఈ మాటలు విన్న వెంటనే, అబూ తాలిబ్ తీవ్ర ఆందోళనకు గురై, దైవ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లంను పిలిపించి ఇలా అన్నారు, 'ఓ నా సోదరుడి కుమారుడా!, నా ప్రజలు నా వద్దకు వచ్చి ఒక సందేశాన్ని అందించారు మరియు ఇలా చెప్పారు, 'మేము మా శాయశక్తులా ప్రయత్నించి, మా శక్తికొలది అతనికి సమర్పించుటకు సిద్ధముగా ఉన్నప్పటికి, మీ సోదరుడి కుమారుడు మా ప్రతిపాదనలలో ఏ ఒక్కదానిని అంగీకరించకపోతే, అప్పుడు మీరు అతన్ని వదులుకోవాలి. ఒకవేళ మీరు అతన్ని విడిచిపెట్టడానికి ఇష్టపడకపోతే, అప్పుడు మేము మీ అధికారాన్ని తిరస్కరించి, మిమ్మల్ని విడిచి వెళ్ళిపోతాము. అబూ తాలిబ్ ఈ మాటలు ప్రస్తావించినప్పుడు, ఆయన కళ్ళు నీటితో నిండిపోయాయి. అబూతాలిబ్ కళ్ళలో నీళ్ళు వచ్చాయి. అబూతాలిబ్ కళ్ళలో కన్నీరు చూసి, దైవ ప్రవక్త (స.అ.స) కళ్ళు కూడా చెమ్మగిల్లాయి. అప్పుడు ప్రవక్త (స) ఇలా పలికారు:

"ఓ నా పినతండ్రీ! మీరు మీ ప్రజలను వదిలిపెట్టి, నాకు మద్దతు ఇవ్వాలని నేను మిమ్మల్ని కోరడం లేదు. మీరు నా నుండి మీ మద్దతు ఉప సంహరించుకుని, మీ ప్రజలతోనే కలిసి ఉండవచ్చు. కానీ, ఏ భాగస్వామి లేని ఏకేశ్వరుడైన అల్లాహ్ సాక్షిగా నేను ప్రమాణం చేస్తున్నాను. ఒకవేళ సూర్యుని నా కుడి చేతిలోనూ, చంద్రుని నా ఎడమ చేతిలోనూ ఉంచినా సరే, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఏకత్వాన్ని (తౌహీద్‌ను) బోధించడం నుండి నేను ఏమాత్రం వెనుకాడను. మరణం నన్ను కబళించేంత వరకు నేను నా ఈ ప్రయత్నాన్ని కొనసాగిస్తూనే ఉంటాను.

మీకు ఏది శ్రేయస్సో మీరే నిర్ణయించుకోండి." అత్యంత గాఢమైన విశ్వాసం మరియు చిత్తశుద్ధితో కూడిన ఈ సమాధానం, అబూ తాలిబ్ కళ్ళు తెరిపించడానికి సరిపోయింది. ఇస్లాంను స్వీకరించే భాగ్యం తనకు లభించకపోయినప్పటికీ, అటువంటి అచంచలమైన విశ్వాసాన్ని కళ్ళారా చూడగలగడమే అన్ని సంపదల కంటే ఎంతో విలువైన సంపదని ఆయన గ్రహించారు. అప్పుడు అబూ తాలిబ్ ఇలా అన్నారు: "ఓ నా సోదరుడి కుమారుడా! నీ కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూనే ఉండుము. నా ప్రజలు నన్ను వదిలి వెళ్ళాలనుకుంటే వెళ్ళనివ్వు; కానీ నేను మాత్రం నిన్ను ఎప్పటికీ వదిలిపెట్టను."

(దిబాచా తఫ్సీరుల్ ఖురాన్, అన్వారుల్‌ఉలూమ్, సంపుటి 20, పేజీలు 199-202)


తౌహీద్‌ను (దేవుని ఏకత్వాన్ని) స్థాపించడం కోసం, దైవ ప్రవక్త (స) మక్కా అవిశ్వాసుల చేతిలో అన్ని రకాల హింసలను, క్రూరత్వాలను సహించారు. వారు (స) తన సహచరులలో కూడ అదే స్ఫూర్తిని నింపారు. ఫలితముగా వారు తమ తలలను నరికించుకున్నారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం వ్రాసినట్లుగా, వారు "అహద్, అహద్" (దేవుడు ఒక్కడే, దేవుడు ఒక్కడే) అని నినదిస్తూనే, హింసలను స్థైర్యంతో భరించారు మరియు తమ ప్రాణాలనే బలిదానం చేశారు.

(అత్తబ్ఖాతుల్ కుబ్రా లి ఇబ్న్ సాద్, సంపుటి 3, పేజీ 175, "బిలాల్ బిన్ రబాహ్" భాగం 8, పేజీ 207, "సుమయ్య బింత్ ఖబ్బాత్", దారుల్-కుతుబుల్-ఇల్మియ్యా, బీరూట్)

మక్కా అవిశ్వాసులలో ఉన్నటు వంటి దుష్కార్యాలన్నీ, ఇప్పుడే ప్రస్తావించబడిన వన్నియు దైవ ఏకత్వానికి వారు దూరంగా ఉండటం వల్ల మరియు వారు 'షిర్క్'లో (దేవునికి భాగస్వాములను కల్పించడంలో) మునిగి తేలడం వల్లనే ఉద్భవించాయి. నేను ఇంతకు ముందు చెప్పినట్లుగా, నేడు కూడా, వివిధ జాతులలో లేదా వ్యక్తులలో ఇటువంటి నైతిక రుగ్మతలు ఎక్కడ కనిపించినా, అవి తౌహీద్ నుండి దూరం కావడం వలనే ఉత్పన్నమవుతాయి. అందువల్ల, దైవ ఏకత్వాన్ని ప్రకటిస్తూ ఉండటమే మన కర్తవ్యం. మనం ఈ తౌహీద్ సందేశాన్ని ఎక్కడైతే తెలియ జేస్తామో, అక్కడ మన స్వంత ఆధ్యాత్మిక మరియు నైతిక స్థితులలో కూడా స్పష్టమైన పరివర్తనను తీసుకురావడానికి కృషి చేయాలి. అప్పుడే మనం నిజంగా తౌహీద్‌ను విశ్వసించేవారిగా మరియు సర్వశక్తిమంతుడైన అల్లాహ్ ఆజ్ఞలకు అనుగుణంగా నడుచుకునేవారిగా పరిగణించబడతాము.

అల్లాహ్ తఆలా ఇందుకు మనకు సామర్థ్యాన్ని ప్రసాదించుగాకా! ఆమీన్.

J.K WOOD WORKS Mob.9393727201
Spl.Capboard & Interior 7989385296
#8-125/A, Chandanagar, Hyderabad
దుఆ ఆశించువారు: SK Meera sb, Jagadth giri gutta, Hyderabad, (Telangana)



Love for All Hatred for None
99493-56387
Prop:Muhammad Saleem
MASROOR HOTEL
TEA,TIFFIN,MEALS,CHICKEN-BIRYANI,FAST-FOOD AVAILABLE HERE
Near Naidu Petrol Pump, Khammam Rd. Warangal (Telengana)
Mohammad Saleem (Naib Ameer Zila Jamat Ahmadiyya Warangal (Telengana)

**సీరత్ ఖాతమున్నబియ్యీన్ (సల్లల్లాహు అలైహి వసల్లం):-**

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

(గత సంచిక తరువాత భాగం)

**కాబా పునర్నిర్మాణం:-**

ఈ అనుబంధమైన కానీ ముఖ్యమైన చర్చ అనంతరం, మన ప్రధాన విషయానికి తిరిగి వద్దాము. దేవుని ఆజ్ఞ ప్రకారం ప్రవక్త ఇబ్రాహీం (అ) హాజరా మరియు ఆమె కుమారుడు ఇస్మాయీల్‌ను మక్కా యొక్క నిర్జన లోయలో నివసింపజేసి తిరిగి వెళ్లిన విషయం ఇప్పటికే వివరించబడింది. ఇబ్రాహీం రెండవసారి లేదా మూడవసారి అరేబియాకు వచ్చినప్పుడు, హాజరా అప్పటికే మరణించి ఉండేను. యాదృచ్ఛికంగా ఆ రెండు సందర్భాల్లోనూ ఇస్మాయీల్ (అ)బయట ఉండడంతో తండ్రి కొడుకుల కలయిక జరగలేదు. తర్వాత ఇబ్రాహీం (అ) నాల్గవసారి అరేబియాకు వచ్చాడు. ఈసారి తండ్రి, కొడుకు కలిసి మక్కాలో ఒక ఆరాధనా మందిరాన్ని నిర్మించడం ప్రారంభించారు. వాస్తవానికి ఈ పవిత్ర స్థలం చాలా ప్రాచీనమైనది, కానీ దాని ఆనవాళ్లు కనుమరుగైపోయాయి. దేవుని నుండి జ్ఞానం పొందిన ఇబ్రాహీం, దానిని అసలు పునాదులపై తిరిగి నిర్మించాలని నిర్ణయించాడు. ఇస్మాయీల్ తన తండ్రికి రాళ్లు తెచ్చి నిర్మాణంలో సహాయం చేశాడు. గోడలు కొంత ఎత్తుకు చేరుకున్న తర్వాత, ఇబ్రాహీం (అ) కాబా యొక్క ఒక మూలలో ఒక ప్రత్యేక రాయిని అమర్చాడు. దేవుని గృహం చుట్టూ ప్రదక్షిణ (తవాఫ్) ప్రారంభించాల్సిన స్థలాన్ని గుర్తించడానికి అది ఒక గుర్తుగా ఉంచబడింది. ఈ రాయినే హజరుల్ అస్వద్ (నల్ల రాయి) అంటారు. హజ్ యాత్రికులు తవాఫ్ సమయంలో దానిని ముద్దుపెట్టుకుంటారు లేదా సూచనగా సలాంలు తెల్పుతారు. అయితే, హజరుల్ అస్వద్ స్వయంగా పవిత్రమైన వస్తువు కాదని గుర్తుంచుకోవాలి. దానిని ముద్దుపెట్టడం విగ్రహారాధన కూడ కాదు. అది కేవలం ఒక గుర్తు మాత్రమే. దాని ప్రాముఖ్యత కాబాతో అనుసంధానమైన పవిత్ర సంప్రదాయాల వల్ల ఏర్పడింది.

ఒక ప్రసిద్ధ హదీసు ప్రకారం, రెండవ ఖలీఫా హజ్రత్ ఉమర్ రజి కాబా చుట్టూ తవాఫ్ చేస్తున్నప్పుడు హజరుల్ అస్వద్‌ను ఉద్దేశించి ఇలా అన్నారు:

"ఓ రాయీ! నీవు కేవలం ఒక రాయి మాత్రమేనని నాకు తెలుసు. నీవు లాభం చేయలేవు, నష్టం చేయలేవు. అల్లాహ్ ప్రవక్త నిన్ను ముద్దుపెట్టుకున్నట్లు నేను చూడకపోయి ఉంటే, నేను ఎన్నడూ నిన్ను ముద్దుపెట్టుకునేవాడిని కాదు."

తవాఫ్ సమయంలో గౌరవించబడేది కేవలం హజరుల్ అస్వద్ ఉన్న మూల మాత్రమే కాదు; దాని పక్కనున్న మూలను కూడా స్పృశిస్తారు లేదా ముద్దు పెడతారు. మిగిలిన రెండు మూలలను అలా చేయరు, ఎందుకంటే ప్రస్తుతం ఉన్న నిర్మాణంలో హతీమ్ అనే భాగం వెలుపల ఉండటం వల్ల అవి తమ అసలు స్థానాల్లో లేవు. కాబట్టి హజరుల్ అస్వద్‌కు స్వతంత్ర పవిత్రత ఏదీ లేదని అర్థమవుతుంది.

సారాంశంగా చెప్పాలంటే, ఇబ్రాహీం మరియు ఇస్మాయీల్ కలిసి సాధారణ రాళ్లతో పైకప్పు లేని ఒక దీర్ఘచతురస్రాకార నిర్మాణాన్ని నిర్మించారు. దాని ఎత్తు సుమారు తొమ్మిది మూరలు, పొడవు ముప్పై రెండు మూరలు, వెడల్పు ఇరవై రెండు మూరలు. ఇదే నేటి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల ఆధ్యాత్మిక కేంద్రంగా ఉన్న కాబా.

**ఇబ్రాహీం(అ) దుఆ:-**

పవిత్ర ఖుర్ఆన్ ఈ నిర్మాణాన్ని ఈ విధంగా వర్ణిస్తుంది:

"నిశ్చయంగా, మానవుల కొరకు దేవుని ఆరాధన కోసం స్థాపించబడిన తొలి గృహం బక్కా (మక్కా)లో ఉన్నదే. అది ఆశీర్వదించబడినది మరియు సమస్త లోకాల వారికి మార్గదర్శకం.

ఇబ్రాహీం మరియు ఇస్మాయీల్ ఆ గృహపు పునాదులను ఎత్తుతున్నప్పుడు ఇలా ప్రార్థించారు:

'ఓ మా ప్రభువా! మా నుండి ఈ సేవను స్వీకరించు. నీవే సర్వశ్రోతవు, సర్వజ్ఞుడవు. ఓ మా ప్రభువా! మమ్మల్ని నీకు విధేయులుగా చేయి. మా సంతానం నుండి కూడా నీకు విధేయమైన ఒక సమాజాన్ని ఉద్భవింపజేయి. మాకు ఆరాధన మరియు హజ్ విధానాలను చూపించు. మాపై కరుణతో దృష్టి సారించు. నీవే క్షమించే వాడవు, అత్యంత కరుణామయుడవు. ఓ మా ప్రభువా! వారిలో నుంచే ఒక ప్రవక్తను పంపు. అతడు నీ సూక్తులను వారికి వినిపించాలి, గ్రంథాన్ని మరియు జ్ఞానాన్ని బోధించాలి, వారిని పవిత్రులను చేయాలి. నీవే సర్వశక్తిమంతుడు, జ్ఞానవంతుడు." ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) యొక్క ఆగమనం ఈ హృదయపూర్వక ప్రార్థనకు ఫలితంగా పరిగణించబడింది. అందుకే ప్రవక్త (స) ఇలా చెప్పేవారు: "నేను ఇబ్రాహీం ప్రార్థన యొక్క ఫలితాన్ని."

**హజ్ ప్రకటన:-**

కాబా నిర్మాణం పూర్తయిన తరువాత, అల్లాహ్ ఇబ్రాహీంను ఇలా ఆదేశించాడు: "నా గృహాన్ని తవాఫ్ చేసేవారి కోసం, ప్రార్థనలో నిలిచేవారి కోసం, రుకూ చేసేవారికోసం, సాష్టాంగపడేవారి కోసం పవిత్రంగా ఉంచుము. మరియు ప్రజలలో హజ్‌ను ప్రకటించుము. వారు నీ వద్దకు కాలినడకన వస్తారు. ప్రతి దూరమైన మార్గం నుండి సన్నగా ఉన్న ఒంటెలపై కూడా వస్తారు."

ఈ ప్రకటన కాబా ఒక మతపరమైన కేంద్రంగా మారడానికి పునాది వేసింది. కొద్ది కాలంలోనే అది మొత్తం అరేబియాకు ఆధ్యాత్మిక కేంద్రంగా మారింది. దూర ప్రాంతాల నుండి ప్రజలు హజ్ కోసం అక్కడికి రావడం ప్రారంభించారు.

**కాబా సంరక్షణాధికారం:-**

మక్కాలో మొదట స్థిరపడిన తెగ జుర్‌హుముస్సానియా, అని ముందే పేర్కొనబడింది. ఇస్మాయీల్ (అ)వారి నాయకుడు ముజాజ్ బిన్ అమర్ కుమార్తెను వివాహం చేసుకున్నాడు. వారికి పన్నెండు మంది కుమారులు జన్మించారు. వారిలో పెద్దవాడు నాబిత్, రెండవవాడు ఖైదార్ (కేదార్).అరబ్బులలో చాలామంది తమ వంశాన్ని ఖైదార్ వరకు అనుసరిస్తారు. ఖురైష్ తెగ కూడా ఖైదార్ సంతతికే చెందినది. ఇస్మాయీల్ (అ)జీవించి ఉన్నంత కాలం కాబా సంరక్షకుడిగా ఉన్నాడు. వారి మరణం తరువాత ఈ బాధ్యత వారి పెద్ద కుమారుడైన నాబిత్‌కు వెళ్లింది. నాబిత్ మరణించిన తరువాత, అది అతని తాత ముజాజ్ బిన్ అమర్‌కు వెళ్లి, చాలా కాలం పాటు జుర్‌హుమ్ తెగ చేతిలోనే కొనసాగింది. కానీ తరువాత ఖుజాఅహ్ అనే ఖహ్తానీ అరబ్ తెగ జుర్‌హుమ్‌పై విజయం సాధించి, మక్కా మరియు కాబాపై నియంత్రణను స్వాధీనం చేసుకుంది. మక్కా నుండి బహిష్కరించబడిన జుర్‌హుమ్ తెగ తీవ్రంగా బాధపడింది. వారు యెమెన్ వైపు తిరిగి వెళ్లే ముందు, వారి నాయకుడు అమర్ బిన్ హారిస్ తమ సంపదను జమ్‌జమ్ బావిలో వేసి దానిని మూసివేశాడు. అందువల్ల ఖుజాఅహ్ మక్కాలో ప్రవేశించినప్పుడు పవిత్ర జలధార కనిపించలేదు. అది శతాబ్దాల పాటు దాగి ఉండి, తరువాత ప్రవక్త ముహమ్మద్ తాత అబ్దుల్ ముత్తలిబ్ చేత మళ్లీ కనుగొనబడి తెరవబడింది. జుర్‌హుమ్ తెగ తరువాత ఖుజాఅహ్ మక్కా పాలకులుగా, కాబా సంరక్షకులుగా మారారు. కాబాలో విగ్రహారాధన ప్రవేశపెట్టిన వ్యక్తిగా ఖుజాఅహ్ నాయకుడు అమర్‌బిన్ ఇబ్న్ లుహయ్యీ పేరు చెప్పబడుతుంది. సిరియాకు వెళ్లినప్పుడు అతను అక్కడ ప్రజలు విగ్రహాలను పూజించడం చూసి, అలాంటి ఆచారాన్ని మక్కాలో కూడా ప్రవేశపెట్టాలని కోరుకున్నాడు. అందుకే కొన్ని విగ్రహాలను సిరియా నుండి తీసుకువచ్చి కాబా చుట్టూ ప్రతిష్ఠించాడు. ఆ సమయానికి కాబా అరేబియాకు ప్రధాన మత కేంద్రంగా మారినందున, ప్రతి సంవత్సరం అక్కడికి వచ్చే యాత్రికుల ద్వారా విగ్రహారాధన క్రమంగా మొత్తం అరేబియాలో వ్యాపించింది. కాలక్రమేణా కాబా లోపల మరియు చుట్టుపక్కల ఉన్న విగ్రహాల సంఖ్య 360 వరకు పెరిగినట్లు చెప్పబడుతుంది.

**ఖుసయ్యీ ఇబ్న్ కిలాబ్ ఎదుగుదల:-**

అనేక సంవత్సరాల తరువాత, కాబా సంరక్షణాధికారం ఖుజాఅహ్ చేతుల నుండి కూడా వెళ్లిపోయింది. ఈ మార్పు గురించి చరిత్రకారులు ఒక ఆసక్తికరమైన కథను వివరిస్తారు. క్రీ.శ. 5వ శతాబ్దం మధ్యకాలంలో, ఫిహర్ బిన్ మాలిక్ (ఖురైష్ తెగ) వంశంలో ఖుసయ్యీ బిన్ కిలాబ్ అనే వ్యక్తి వెలుగులోకి వచ్చాడు. అతను అత్యంత తెలివైనవాడు. యవ్వనంలోనే మక్కా పాలన మరియు కాబా సంరక్షణ హక్కు ఇస్మాయీల్ సంతతికే చెందుతుందని విశ్వసించాడు. ఖుసయ్యీ మక్కాకు వచ్చి క్రమంగా ప్రభావాన్ని సంపాదించాడు. ఆ కాలంలో ఖుజాఅహ్ నాయకుడు మరియు కాబా సంరక్షకుడు అయిన హులయిల్ బిన్ హుబ్షియ్యా అల్-ఖుజాఈ కుమార్తె హుబ్బాను వివాహం చేసుకున్నాడు. హులయిల్ మరణించే సమయంలో కాబా సంరక్షణ తన కుమార్తె హుబ్బాకు చెందాలని ఆదేశించాడు. దీంతో ఆచరణాత్మకమైన అధికారం ఖుసయ్యీ చేతికి వచ్చింది. కానీ అతను కేవలం ప్రతినిధిగా ఉండటంతో సంతృప్తి చెందలేదు. మక్కాకు అధికారిక పాలకుడిగా మరియు కాబాకు చట్టబద్ధ సంరక్షకుడిగా గుర్తింపు పొందాలని కోరుకున్నాడు. తన హక్కును క్రమంగా స్థాపించడానికి ప్రయత్నించగా, ఖుజాఅహ్ తెగ ఆగ్రహించి యుద్ధానికి దిగింది.

**అహాదీస్ బోధనలు**

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు:

**"ఒక సమాజానికి ప్రారంభములో నేను, అదే సమాజానికి చివరిలో ఈసా ఇబ్నే మరియం ఉన్నచో ఆ సమాజం ఎన్నడు నాశనం కాదు."**

(కంజులుల్ ఆమాల్, హర్ఫ్ అల్ ఖాఫ్, కితాబుల్ ఖియామతు, బాబ్ ఖురూజుల్ మహ్దీ, 38671)

దుఆ ఆశించువారు: ***Muhammad Nazeer Ahmad sb, warangal, (Telangana)***

**అహాదీస్ బోధనలు**

**"ఒక మునల్మానుడి విశిష్ట లక్షణమేమనగా, తన మునల్మాను సోదరుడిని చూసినప్పుడు అతని కోసం దగ్గరిగా కూర్చోవలెను." అనగా అతనికి కూడ కూర్చొవడానికి చోటును ఇవ్వవలెను.**

(మిష్కాతుల్ మసాబీహ్, కితాబుల్ అదబ్, బాబుల్‌ఖియామ్, ఫసలుస్సాలిస్)

దుఆ ఆశించువారు: ***Muhammad Vazeer Ahmad sb***

ఖుసయ్యీ కూడా తన అనుచరులను సమీకరించాడు. రెండు వర్గాల మధ్య తీవ్రమైన పోరాటం జరిగింది. చివరికి, ఇద్దరూ ఒక మధ్యవర్తిని నియమించి అతని తీర్పును అంగీకరించాలని నిర్ణయించుకున్నారు. అమర్ బిన్ ఔఫ్ అనే వ్యక్తిని మధ్యవర్తిగా ఎన్నుకున్నారు. అతను ఈ విధంగా తీర్పు ఇచ్చాడు:

ఖుసయ్యీ కాబాకు చట్టబద్ధ సంరక్షకుడు. యుద్ధంలో మరణించిన ఖుజాఅహ్ సభ్యులకు ఎలాంటి పరిహారం చెల్లించాల్సిన అవసరం లేదు. ఖుసయ్యీ అనుచరుల మరణాలకు సంబంధించిన పరిహారాన్ని ఖుజాఅహ్ చెల్లించాలి. ఈ విధంగా, చాలా కాలం తరువాత కాబా సంరక్షణ మళ్లీ ఇస్మాయిల్ (అ) సంతతికి తిరిగి వచ్చింది. కాబాపై నియంత్రణ ఆధ్యాత్మిక గౌరవంతో పాటు రాజకీయ ప్రభావానికి కూడా మూలం కావడంతో, ఖురైష్ తెగ మొత్తం అరేబియాలో అపారమైన గౌరవం మరియు ప్రతిష్ఠను పొందింది.

**కాబా యొక్క పునర్నిర్మాణాలు:-**

ఈ లోకంలోని ప్రతి వస్తువూ కాలక్రమేణా శిథిలమవుతుంది మరియు దెబ్బతింటుంది. అందువల్ల ప్రవక్త ఇబ్రాహీం (అ) నిర్మించిన తరువాత కాబా అనేక సార్లు కూలిపోయి మళ్లీ నిర్మించబడింది. కొన్ని సందర్భాల్లో మక్కా లోయలో అప్పుడప్పుడు వచ్చే వరదలు దాని నిర్మాణాన్ని దెబ్బతీయడంతో, దాని సంరక్షకులు దానిని కూల్చి తిరిగి నిర్మించేవారు. మరికొన్ని సందర్భాల్లో అగ్నిప్రమాదాలు లేదా ఇతర ప్రమాదాల కారణంగా పునర్నిర్మాణం అవసరమయ్యేది. కాబా సంరక్షణ బాధ్యతను చేపట్టిన ప్రతి తెగ లేదా ప్రజలు ఏదో ఒక సమయంలో దానిని పునర్నిర్మించాల్సి వచ్చింది. బను జుర్‌హమ్, ఖుజాఅహ్ మరియు ఖురైష్ తెగలు తమ తమ కాలంలో కాబాను పునర్నిర్మించాయి. ఖుసయ్యీ కూడా ఒకసారి దానిని పునర్నిర్మించాడు. తరువాత ప్రవక్త ముహమ్మద్ (స) జీవించిన కాలంలో ఖురైష్ మళ్లీ కాబాను నిర్మించి కొన్ని మార్పులు చేశారు. వారు దాని ఎత్తును పెంచి, పైకప్పు ఏర్పాటు చేసి, లోపల ఆరు స్తంభాలను నిర్మించి, పైకప్పులో ఒక వెలుతురు రంధ్రాన్ని (స్కైలైట్) ఏర్పాటు చేసి, కాబా తలుపును మరింత ఎత్తుగా నిర్మించారు. అయితే, తగినంత ఆర్థిక వనరులు లేకపోవడంతో వారు కాబాను దాని అసలు ఇబ్రాహీమీ పునాదులపై పూర్తిగా నిర్మించలేకపోయారు. అందువల్ల ఒక వైపున సుమారు ఏడు మూరల స్థలాన్ని బయట వదిలివేశారు. ఈ భాగాన్ని హతీమ్ లేదా హిజ్ర్ అని పిలుస్తారు. ప్రవక్త ముహమ్మద్ (స) దీనిని కూడా కాబాలో భాగమేనని ప్రకటించారు. అందుచేత తవాఫ్ (కాబా చుట్టూ ప్రదక్షిణ) చేసే యాత్రికులు ఈ ప్రాంతం వెలుపల నుంచే తిరగాలి.

ఒక సందర్భంలో ప్రవక్త (స) ఆయిషా (ర.అ)తో ఇలా అన్నారు:

"హతీమ్ నిజానికి కాబాలో భాగమే. ఖురైష్ వారి వద్ద తగినంత ధనం లేకపోవడంతో దానిని బయట వదిలివేశారు. అలాగే వారు కాబా తలుపును ఎత్తుగా నిర్మించారు, తద్వారా తమకు నచ్చిన వారిని లోపలికి అనుమతించి, నచ్చనివారిని నిరోధించగలిగారు. ఓ ఆయిషా! నీ ప్రజలు ఇటీవలే ఇస్లాంను స్వీకరించకపోయి ఉంటే, మరియు వారి మనసుల్లో కలత ఏర్పడుతుందనే భయం నాకు లేకపోయి ఉంటే, వారు నిర్మించిన ఈ కట్టడాన్ని కూల్చి, ఇబ్రాహీం నిర్మించిన అసలు పునాదులపై మళ్లీ నిర్మించేవాడిని. హతీమ్‌ను దానిలో భాగంగా చేర్చి, తలుపును క్రిందికి దించి, ప్రస్తుతం ఉన్న తలుపుకు ఎదురుగా మరో తలుపును కూడా ఏర్పాటు చేసేవాడిని."

అనంతరం 64 హిజ్రీ (683--684 హిజ్రి) సంవత్సరంలో కాబా దెబ్బతిన్నప్పుడు, అప్పటి మక్కా పాలకుడైన అబ్దుల్లాహ్ బిన్ జుబైర్ (రజి) ప్రవక్త (స)కోరికను నెరవేర్చాడు. ఆయన కాబాను అసలు ఇబ్రాహీమీ పునాదులపై పునర్నిర్మించి, లోపల ఉన్న స్తంభాల సంఖ్యను ఆరు నుండి మూడుకు తగ్గించాడు. తరువాత అబ్దుల్ మాలిక్ బిన్ మర్వాన్ మక్కాపై ఆధిపత్యం సాధించినప్పుడు, ప్రవక్త (స) స్వయంగా ఈ మార్పు చేయనందున మరెవరికీ దాన్ని చేయగల హక్కు లేదని భావించాడు. అందుచేత ఆయన అల్-హజ్జాజ్ బిన్ యూసుఫ్‌కు, ఇబ్న్ అజ్జుబైర్ నిర్మించిన నిర్మాణాన్ని కూల్చి, ప్రవక్త (స) కాలంలో ఉన్న విధంగా కాబాను తిరిగి నిర్మించాలని ఆదేశించాడు. అల్-హజ్జాజ్ ఆ ఆదేశాన్ని అమలు చేశాడు. అయితే లోపల మూడు స్తంభాలు మాత్రమే ఉండే మార్పును అలాగే కొనసాగించాడు.

**(సీరత్ ఖాతమున్నబియ్యీన్, హజ్రత్‌మిర్జా బషీర్ అహ్మద్‌రజి ఎం..ఏ పేజి (85-90)**

**(తదుపరి సంచికలో)**

| | |
|---|---|
| **వర్తమాన ఖలీఫా వాఖ్యములు** | **"అల్లాహ్ మరియు అతని ప్రవక్త పట్ల సంపూర్ణ ప్రేమాభిమానాలు లేనంత వరకు ప్రాపంచిక ప్రేమ తగ్గదు, అదే విధముగా మరణించు సమయంలో మానవునికి మనశ్శాంతి లభించదు, మరణ సమయంలో కల్గె ఆందోళన కూడ దూరం కాదు. "**<br>**(జుమా ప్రసంగం 14 సెప్టెంబర్ 2018)** |

**దుఆ ఆశించువారు: *Darga sb, jamat AhmadiyyaVizag (A.P)***

ఇస్లాంను స్వీకరించడానికి ముందు, 'ఉమైర్ మరియు సఫ్వాన్ బిన్ ఉమయ్య ఒకరోజు మక్కాలో హతీమ్ పక్కన కూర్చున్నారు. సఫ్వాన్ ఇంకా ఇస్లాం స్వీకరించలేదు. వారిద్దరూ బదర్ యుద్ధం ఓటమి గురించి మరియు యుద్ధంలో మరణించిన వారి ప్రముఖ నాయకుల గురించి చర్చించుకుంటున్నారు. సఫ్వాన్ ఇలా అన్నాడు: "దేవునిపై ప్రమాణం!. ఈ పెద్దలను చంపిన తర్వాత జీవితంలో సంతోషం లేదు. అందుకు ఉమైర్ ఇలా సమాధానమిచ్చాడు: "దేవునిపై ప్రమాణం! మీరు చెప్పింది నిజమే." అతను ఇలా అన్నాడు: "నేను ఎవరివద్ద అప్పుతీసుకొని ఉండకపోతే దానిని ఇప్పుడు నేను చెల్లించలేకపోతున్నాను మరియు నా భార్య మరియు పిల్లల గురించి నా మరణం తర్వాత వారు పేదరికాన్ని ఎదుర్కొంటారు అని నేను చింతించకపోతే, నేను ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వెళ్లి చంపివేసేవాడిని. నా కొడుకు వారిచే బంధించబడ్డాడు కాబట్టి నేను వారి వద్దకు వెళ్ళడానికి కూడా ఒక కారణం ఉంటుంది. ఇది విన్న సఫ్వాన్, ఉమైర్ అప్పును తీరుస్తానని ప్రమాణం చేసి ఇలా అన్నాడు: "నీ అప్పును నాకు వదిలేయండి, నేను దాన్ని తీరుస్తాను. మరియు మీ భార్య మరియు పిల్లలు నా భార్య మరియు పిల్లలతో ఉంటారు. వారు జీవించి ఉన్నంత కాలం వారి సంరక్షణ, పోషణ బాధ్యత నేనే తీసుకుంటాను. నీవు వెళ్లి ముహమ్మద్(సల్లల్లాహు అలైహి వసల్లం)ను (నవూజ్ బిల్లాహ్)చంపివేయుము. ని చంపండి. ఉమైర్ అతని మాటలు విని వెళ్ళడానికి సిద్ధమై సఫ్వాన్‌తో ఇలా అన్నాడు: "నా మధ్యలో మరియు నీ మధ్యలో జరిగిన ఈ మాటలను మీరు చాలా గోప్యముగా ఉంచండి." అందుకు సఫ్వాన్ అలాగే గోప్యముగా ఉంచుతానని వాగ్దానం చేశాడు. దీంతో ఉమైర్ ఇంటికి వెళ్లి కత్తి తీసి పదును పెట్టి విషంలో ముంచి మక్కా నుంచి బయలుదేరి మదీనా చేరుకున్నాడు.

ఉమైర్ మస్జిద్ నబవీకి చేరుకున్నప్పుడు, హజ్రత్ ఉమర్ రజియల్లాహ్ తాలా అన్‌హు మరికొందరు ముస్లింలతో ఒక సమావేశంలో కూర్చుని బదర్ యుద్ధం గురించి చర్చిస్తున్నారు. ఉమైర్ తన ఒంటెను మస్జిదే-నబవి తలుపుల వద్ద కూర్చోబెడుతున్న సమయంలో హజ్రత్ ఉమర్ రజి చూపు అతనిపై పడింది. అతడు తన చేతిలో ఖడ్గంను తీసుకొని ఒంటె నుండి దిగడం చూశాడు. అతనిని చూసిన హజ్రత్ ఉమర్ రజి ఇలా అన్నారు: "దేవుని శత్రువు, 'ఉమైర్ బిన్ వాహబ్, ఖచ్చితంగా చెడు ఉద్దేశ్యంతో ఇక్కడకు వచ్చాడు." ఆ తరువాత హజ్రత్ ఉమర్ రజి వెంటనే అక్కడ నుండి లేచి ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు హుజూర్ (స) శుభప్రదమైన గది వద్దకు చేరుకొని ఇలా విన్నవించుకున్నాడు. "ఓ అల్లాహ్ యొక్క ప్రవక్త! ఈ దేవుని శత్రువు, 'ఉమైర్ బిన్ వాహబ్, ఒరలేని ఖడ్గంతో ఇక్కడికి వచ్చాడు. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం అతనిని నా వద్దకు తీసురండి అని ఆదేశమిచ్చారు: హజ్రత్ ఉమర్ రజి నేరుగా ఉమైర్ వద్దకు వెళ్లి, అతని కంఠంపై ఖడ్గం పెట్టీ, అతనిని గట్టిగా పట్టుకుని, తీసుకవెళ్ళారు. అక్కడ హజ్రత్ ఉమర్ రజితో పాటు కొంత మంది అన్సారీ ముస్లింలు కూడ ఉన్నారు. వారితో హజ్రత్ ఉమర్ రజి" ఇలా అన్నారు. "నాతో పాటు మీరు కూడ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు వచ్చి హుజూర్ (స) దగ్గరే కూర్చోండి, ఎందుకంటే ఇతడు నమ్మకస్థుడు కాదు. .'ఆ తరువాత, హజ్రత్ ఉమర్ రజి అతని తీసుకొని ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం వద్దకు చేరుకున్నారు. సల్లల్లాహు అలైహివ సల్లం తన మెడలో ఉన్న ఉమైర్ కత్తి పట్టీని గట్టిగా పట్టుకుని హజ్రత్ ఉమర్ రజి ఈ విధంగా రావడం చూసి అనగా ఉమైర్ మెడలో ఉన్నటు వంటి ఖడ్డాన్ని అతని మెడ క్రిందిభాగంలో అదిమిపట్టి తీసుక రావడాన్ని చూసి హుజూర్ (స) ఇలా అన్నారు. "ఉమర్, అతన్ని వదిలిపెట్టండి. అని అన్నారు. ఆ తరువాత హుజూర్ (స) "ఉమైర్, దగ్గరికి రా" అని పిలిచారు. "అందుకు ఉమైర్ దగ్గరికి వచ్చాడు. ఆపై అతడు అజ్ఞానపు రోజుల ఆచారం ప్రకారం అతడు హుజూర్ (స)కు అన్‌అమూ సబాహన్ అని చెప్పాడు. అనగా సలాంలు తెలిపాడు. అందుకు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. ఉమైర్! మాకు ఇస్లాం మీ సలాం పద్ధతికంటే గొప్ప సలాం పద్ధతిని తెల్పు విధానంను అది కూడ స్వర్గంలోకి ప్రవేశించు వారికి చేయునట్టి సలాంలను నేర్పించింది. కాని నీవు ఎందుకు వచ్చావో చెప్పుము? అని అడిగారు. దానికి ఉమైర్, "నేను మీ చెరలో ఉన్న ఖైదీ (అంటే అతని కొడుకు) గురించి చర్చించడానికి వచ్చాను. ఈ విషయంలో మీరు దయతో వ్యవహరించవలసిందిగా నేను కోరుతున్నాను." అని సమాధానం ఇచ్చాడు. అప్పుడు కవచం లేని ఖడ్గాన్ని చూసి, హుజూర్ (స) ఇలా అడిగారు "అలా అయితే ఈ ఖడ్గం అవసరం ఎందుకు వచ్చింది?" అని అడిగారు. దానికి ఉమైర్, "దేవుడు ఈ ఖడ్గాన్ని నాశనం చేయుగాకా!. మీరు మమ్మల్ని ఏరకంగానైన వదిలిపెట్టారా? ఇంతకు ముందు ఈ ఖడ్గం మనకు ఏదైనా మేలు చేసిందా?" అని చెప్పుకొచ్చాడు. అప్పుడు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు: "నీవు ఎందుకు వచ్చావో నాకు నిజం చెప్పు." హుజూర్ (స)కు అతను చెప్పిన విషయంపై నమ్మకం కలుగలేదు. అప్పుడు ఉమైర్ మరల "నిజాయితీగా చెప్పాలంటే, నేను ఈ ఖైదీని విడిపించుటను గురించి చర్చించడానికి తప్ప మరే ఉద్దేశ్యంతో రాలేదు" అని బదులిచ్చాడు. అప్పుడు హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా అన్నారు. "అబద్ధం, ఒకరోజు నీవు మరియు సఫ్వాన్ బిన్ ఉమయ్య హతీం వద్ద కూర్చున్నారు.

(11వ పేజిలో చదువుము)

**సీరతుల్ మహ్దీ ( అలైహిస్సలాతు వస్సలాం):-**

రచన: హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ సాహెబ్ ఎం.ఏ (రజి).

అపార దయామయుడు, పరమ కరుణామూర్తి, అల్లాహ్ పేరుతో.

(1) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం – మా గౌరవనీయ తల్లిగారు నాతో ఇలా అన్నారు: ఒకసారి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వారితో మాట్లాడుతూ, సుబ్హానల్లాహి వబిహమ్దిహీ, సుబ్హానల్లాహిల్ అజీమ్ ను అధికముగా చదవాలని తనకు అల్లాహ్ తఆలా నుండి తెలిసిందని లేదా అల్లాహ్ తఆలా తనకు తెలియజేశాడని చెప్పారు. మా తల్లిగారు మరల ఇలా చెప్పారు. ఈ కారణంగా వారు (అ) ఈ పదాలను ఎంతో అధికంగా చదివేవారు. రాత్రివేళ మంచంపై ఒక వైపు నుండి మరో వైపుకు తిరుగుతున్నప్పుడు కూడ ఈ పదాలే వారి (అ) ఉచ్చరణలో ఉండేవి. ఈ వృత్తాంతాన్ని నేను మౌల్వీ షేర్ అలీ సాహిబ్ గారికి చెప్పినప్పుడు, వారు కూడా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తరచుగా "సుబ్హానల్లాహ్" అనిఅధికముగా ఉచ్ఛరించడాన్ని గమనించినట్లు చెప్పారు. కాని తాను మాత్రం వారు (అ) ఎప్పుడూ ఇస్తిగ్ఫార్ (అల్లాహ్ క్షమాపణ కోరడం) చదవడాన్ని వినలేదని మౌల్వీ గారు తెలిపారు. ఇక ఈ భవదీయుడు తెల్పునదేమనగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం "సుభ్హానల్లాహ్" అని చదవాన్ని స్వయముగా విన్నాడు.వారు (అ) ఈ పదాలను చాలా మృదువుగా, నెమ్మదిగా, ప్రశాంతంగా, స్థిరంగా ఉచ్చరించేవారు. అలా పలుకుతూనే అల్లాహ్ తఆలా యొక్క సుగుణాలపై పరిశీలిస్తున్నట్లుగా అనిపించేది.

(2) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం – మా గౌరవనీయ తల్లిగారు ఇలా చెప్పారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సాధారణంగా ఎల్లప్పుడూ వుజూ స్థితిలో ఉండేవారు. కాలకృత్యాల అనంతరం తిరిగి వచ్చిన ప్రతిసారి మళ్లీ వుజూ చేసుకునేవారు. కాని అనారోగ్యం లేదా మరేదైనా ఇతర కారణమైనచో (తరువాత వజూ చేసుకునేవారు.)

(3) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం – మా గౌరవనీయ తల్లిగారు ఇలా చెప్పారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సాధారణంగా ఐదు విధి నమాజ్‌లకు అదనంగా, రెండు రకాల నఫిల్ నమాజ్‌లు చేసేవారు. సలాతుల్ ఇష్రాఖ్ (2 లేదా 4 రకాతులు) దీనిని అప్పుడప్పుడు చేసేవారు. సలాతుత్ తహజ్జుద్ (8 రకాతులు) దీనిని నిరంతరం, క్రమం తప్పకుండా చేసేవారు. కాని తీవ్రమైన అనారోగ్యంగా ఉన్న సందర్భాలలో తప్ప. అట్టి అనారోగ్య సమయంలో కూడా తహజ్జుద్ సమయానికి హుజూర్ (అ) మంచంపై పడుకునే దుఆ చేసేవారు. జీవితాంత్య దశలో శారీరక బలహీనత కారణంగా సాధారణంగా కూర్చుని తహజ్జుద్ నమాజ్ చేసేవారు.

(4) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం – మా గౌరవనీయ తల్లిగారు ఇలా చెప్పారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సాధారణంగా ఫజర్ నమాజ్ తరువాత కొద్దిసేపు నిద్రించేవారు, ఎందుకంటే రాత్రి ఎక్కువ భాగం మేల్కొని గడిపేవారు. దానికి ఒక కారణం, హుజూర్ (అ) రాత్రివేళల్లో వ్యాసాలు మరియు గ్రంథాలు రాయాల్సి వచ్చేది. చాలాసార్లు అర్ధరాత్రి దాటిన కూడా రాస్తూ ఉండే వారు. మరో కారణం, మూత్ర విసర్జన కోసం రాత్రిలో అనేకసార్లు లేవాల్సి వచ్చేది. అదనంగా తహజ్జుద్ నమాజ్ కోసం కూడా మేల్కొనేవారు. మా తల్లిగారు మరల ఇలా చెప్పారు: హుజూర్ (అ)కు కిరోసిన్ దీపం వెలుతురులో పని చేయడం ఇష్టం ఉండేది కాదు. దాని బదులు కొవ్వొత్తులు ఉపయోగించేవారు. కొంతకాలం గ్యాస్ ల్యాంపును కూడా ఉపయోగించారు. ఈ భవదీయుడు తెల్పునదేమనగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఒకేసారి అనేక కొవ్వొత్తులను వెలిగించి తన ముందు ఉంచుకునే అలవాటు కలిగి ఉండేవారు. ఒక కొవ్వొత్తి ఆరిపోతే, దాని స్థానంలో మరొకదాన్ని వెలిగించేవారు. ఇంట్లో సాధారణంగా కొవ్వొత్తుల కట్టలను తెప్పించి నిల్వ ఉంచేవారు. నాకు గుర్తున్న మరొక ఘటన ఏమిటనగా, ఒకసారి ఉత్తర వైపున ఉన్న బైతుల్ ఫిక్ర్ వరండాలో, ఉత్తర గోడకు సమీపంలో మంచంపై కూర్చుని ఏదో పనిలో నిమగ్నమై ఉండగా, పక్కనే కొవ్వొత్తులు వెలుగుతున్నాయి. అప్పుడు మా తల్లి గారు ఆ కొవ్వొత్తుల ప్రక్కనుండి వెళ్తుండగా, వారికి తెలియకుండా వెనుకవైపు నుండి వాని దుపట్టా అంచుకు నిప్పు అంటుకుంది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అది గమనించి వెంటనే నిలబడి, తమ చేతులతోనే ఆ మంటను ఆర్పివేశారు. ఆ సమయంలో తల్లిగారు కొంత భయపడిపోయారు.

(5) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం – మా గౌరవనీయ తల్లిగారు ఇలా చెప్పారు: హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఫర్జ్ (విధిగావించబడిన) నమాజ్‌లకు ముందు ఉండే సున్నత్ నమాజ్‌లను ఇంట్లోనే చదివేవారు. ఫర్జ్ నమాజ్ తరువాత సున్నత్‌లను కూడా సాధారణంగా ఇంట్లోనే చదివేవారు, అయితే అప్పుడప్పుడు మస్జిద్‌లో కూడా చేసేవారు. అందుకు ఈ భవదీయుడు " హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం నమాజ్‌లను ఎక్కువసేపు చదివేవారా? లేక సంక్షిప్తంగా చదివేవారా?" అని అడుగగా, మా తల్లి గారు "సాధారణంగా సంక్షిప్తంగానే చదివేవారు" అని సమాధానం ఇచ్చారు.

(6) బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీం – మా గౌరవనీయ తల్లిగారు ఇలా చెప్పారు: ఒకసారి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ తోటలో నడుస్తున్నారు. ఒక నారింజ చెట్టు దగ్గరగా వెళ్తున్నప్పుడు నేను (అంటే తల్లిగారు) లేదా మరెవరైనా, "ఇప్పుడే ఒక నారింజ తినాలని అనిపిస్తోంది" అని అన్నాము. అప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం "మీకు నారింజ కావాలా?" అని అడిగారు. అందుకు మేము " అవును "అని సమాధానమిచ్చాము. అప్పుడు హుజూర్ (అ) చెట్టు కొమ్మలను తమ చేతితో తాకారు. వెంటనే చేతిని వెనక్కి తీసుకున్నారు. అప్పుడు వారి చేతిలో ఒక నారింజ ఉంది. ఆపై హుజూర్ (అ) "ఇదిగో, తీసుకో." అని అన్నారు. ఈ భవదీయుడు తల్లిగారిని " ఆ నారింజ పండు ఎలా ఉన్నది? " అని అడిగాను. అందుకు తల్లిగారు " పసుపు రంగులో పూర్తిగా పండినట్లు ఉన్నది. " అని చెప్పారు. అప్పుడు నేను మరల " మీరు ఆ పండును తిన్నారా? " అని అడిగాను. అందుకు తల్లిగారు " నాకు ఆ విషయం గుర్తుకు లేదు " అని చెప్పారు. అప్పుడు నేను " హుజూర్ (అ) ఎలా చేతిని చెట్టుపై వేశారు?" అని అడిగాను. అందుకు తల్లిగారు " ఏ విధముగానైతే పండ్లను కోసేవారి చేతులు పండ్లపై పడి వెంటనే తిరిగి వస్తాయో అదే విధముగా తిరిగి వచ్చాయి అని చూపించారు. కాని హుజూర్(అ) గారి చేతులు కొమ్మలపై (పండ్లను వెదుకుతున్నట్లుగా) పడలేదు. అప్పుడు మరల నేను "అది నారింజ పండ్ల కాలమా?" అని అడిగాను. అందుకు తల్లిగారు " కాదు, ఆ కాలంలో అసలు చెట్టుకు ఎలాంటి పండ్లు లేవు." అని అన్నారు. నేను ఈ వృత్తాంతాన్ని మౌల్వీ షేర్ అలీ గారికి వినిపించగా, వారు కూడ నేను ఈ వృత్తాంతాన్ని హజ్రత్ ఖలీఫతుల్ మసీహుస్సాని రజితో విన్నట్లుగా తెలిపారు. వారు రజి ఇలా తెలిపారు. " నేను హుజూర్ (అ)ను నారింజ పండును అడుగగా, వారు (అ) చెట్టుపై చేయి వేసి, నాకు నారింజ పండును ఇచ్చారు. "

---

(10వ పేజి తరువాత)ఆపై బదర్ యుద్ధంలో చంపబడి, గొయ్యిలో పడవేయబడిన ఖురైష్ నాయకుల గురించి మాట్లాడుకున్నారు. ఆ సమయంలో, నీవు సఫ్వాన్‌తో, నీ అప్పులు మరియు నీ భార్య మరియు పిల్లల వంటి బాధ్యతలు లేకుంటే, నేను వెళ్ళి మహమ్మద్(స)ను చంపడానికి వెళ్లి ఉండేవాడిని అని అన్నావు. నన్ను చంపే షరతుపై సఫ్వాన్ నీ అప్పు తీర్చే మరియు నీ భార్యాపిల్లల బాధ్యత తీసుకుంటానని అంగీకరించాడు.ఈ విధముగా జరిగింది అని అల్లాహ్ తాలా ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లంకు పూర్తి విషయాన్ని తెలిపాడు. ఈ నిజాలను వినగానే ఉమైర్ మీరు అల్లాహ్ యొక్క ప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను అని పలికాడు. ఓ అల్లాహ్ ప్రవక్తా (స)! మీ వద్దకు ఆకాశం నుండి వార్తలు వచ్చేవి. మీపై దైవవాణి అవతరించేది. కాని మేము ఆ దైవవాణిని తిరస్కరించేవారము. ఇక పోతే ఈ విషయానికి వచ్చినచో ఆ సమయంలో హతీమ్ వద్ద నేను మరియు సఫ్వాన్ కాకుండా మూడవ వ్యక్తియే లేదు. మరెవ్వరికి కూడ మేము పరస్పరం చర్చించుకున్న విషయాన్ని తెలుపలేదు. అందుకే దేవుని ప్రమాణం! అల్లాహ్ తప్ప మరెవ్వరు కూడ మీకు ఆ విషయాన్ని అందించలేదు అని పలికాడు. కావున మనల్ని ఇస్లాం వైపు నడిపించి, నన్ను ఈ మార్గాన్ని అనుసరించేలా చేసిన, మార్గదర్శకాన్ని చూపిన అల్లాహ్‌కే అన్ని ప్రశంసలు చెందుతాయి. ఆతరువాత ఉమైర్ కలిమాయే షహాదత్‌ను పఠించాడు. అప్పుడు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం తమ అనుచరులతో ఇలా అన్నారు. "మీ సోదరుడికి విశ్వాసం మరియు పవిత్ర ఖురాన్ గురించి బోధించండి మరియు అతని ఖైదీని విడిచిపెట్టండి. వెంటనే అనుచరులు ఆయా ఆదేశాలను పాటించారు.

ఆ తరువాత హజ్రత్ ఉమైర్ రజి హుజూర్ సల్లల్లాహు అలైహి వసల్లంతో ఇలా అన్నారు: "ఓ రసూలుల్లాహ్! నేను అల్లాహ్ యొక్క కాంతిని ఆర్పివేయడానికి నా సమయాన్ని వెచ్చించాను మరియు అల్లాహ్ ధర్మమును అంగీకరించిన వారిని తీవ్రంగా హింసించాను. కావున మీరు నాకు మక్కాకు వెళ్లేందుకు అనుమతించండి. తద్వారా నేను అక్కడి ప్రజలను అల్లాహ్ వైపు పిలవాలని, వారిని ఇస్లాంలోకి ఆహ్వానించాలని కోరుకుంటున్నాను. బహుశా అల్లాహ్ కోరుకున్నచో వారికి మార్గనిర్దేశం చేస్తాడు. లేకపోతే, నేను మిమ్మలను మరియు మీ సహచరులను ఇస్లాం స్వీకరించినందున హింసించినట్లే, వారు విగ్రహారాధన చేస్తున్నందున నేను వారిని హింసిస్తాను. అందుకు ఆం హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం అతన్ని మక్కా వెళ్ళడానికి మరియు ప్రచారం చేయడానికి అనుమతించారు కాని, వారికి హాని కలిగించడానికి మాత్రం అనుమతించలేదు. మొత్తానికి అతడు మక్కాకు తిరిగి వచ్చాడు మరియు అతని కుమారుడు వహ్బ్ బిన్ ఉమైర్ కూడా ఇస్లాంను స్వీకరించాడు.

మరోవైపు ఉమైర్ మక్కా నుండి బయలుదేరిన తర్వాత, సఫ్వాన్ ప్రజలకు ఇలా చెప్పడం ప్రారంభించాడు, "బదర్ యుద్ధం యొక్క విషాదం మరియు బాధలను మీరు మరచిపోయేలా చేసేంత అతి త్వరలో జరగబోయే ఒక పెద్ద సంఘటన గురించి నేను మీకు శుభవార్త తెలియజేస్తున్నాను". అదే విధముగా సఫ్వాన్ ఉమైర్ కార్యాచరణను గురించి మదీనా సమీపం నుండి వచ్చే ప్రతి ప్రయాణికుడిని అడిగేవాడు. . చివరికి, ఒక యాత్రికుడు మక్కాకు చేరుకుని సఫ్వాన్‌కు 'ఉమైర్ ఇస్లాంను అంగీకరించాడని తెలియజేశాడు.

EDITOR
SYED RASOOL NIYAZ
Mobile. :+91 9876332272
SUB EDITOR:
MUHAMMAD AKBAR
Mobile. :+91 9948692101
e-mail:
teluguweeklybadar@gmail.com

REGISTERED WITH THE REGISTERAR OF THE NEWS PAPERS FOR INDIA AT NO: PUNTEL/2016/68817
Weekly BADAR Qadian బదర్ తెలుగు వార పత్రిక
Qadian- 143516, Distt: Gurdaspur (Pb.) INDIA
POSTAL REG NO GDP-38/2026-2028. Vol. 11. Thursday, 11 JUN 2026, Issue No - 24

ACT.MANAGER
ATHAR AHMAD SHAMIM
Mobile. : +91 98156 39670
e-mail managerbadrqnd@gmail.com
www.alislam.org/badr

ANNUAL SUBSCRIPTION:Rs.600/- (Per Issue: 12/- ) (WEIGHT: 20-50, grms / issue)

## సయ్యదినా హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహ్ తాలా బినస్రిహిల్ అజీజ్ గారి ఆస్ట్రేలియా పర్యటన 2013.

**19 అక్టోబర్, శనివారం, 2013:- (గత సంచిక తరువాత)**

హుజూర్ అన్వర్ గారు సండే తరగతులకు హాజరవుతున్న బాలికల సంఖ్యను సమీక్షించి, ఈ తరగతులకు మరింత మంది బాలికలు హాజరుకావాలని సూచించారు. పది సంవత్సరాలు మరియు అంతకంటే ఎక్కువ వయస్సు గల బాలికల మధ్య ఎక్కువగా గ్రూప్ చర్చలు జరగాలని హుజూర్ గారు ఆదేశించారు, ఎందుకంటే ఈ విధానం ద్వారా వారు మరింత సమర్థవంతంగా నేర్చుకుంటారు. చర్చల కోసం సూచించిన అంశాలలో "మనం తలను ఎందుకు కప్పుకుంటాము?", "దేవుని ప్రాముఖ్యత" వంటి విషయాలు ఉన్నాయి.

హుజూర్ గారు ఇంకా పేర్కొంటూ, బాలికలు తమ ఆలోచనలు, ఆందోళనలు మరియు సమస్యలను వ్యక్తపరచడానికి చర్చా కార్యక్రమాలలో ఇతర అంశాలను కూడా చేర్చవచ్చని అన్నారు. దీని ద్వారా మార్గదర్శకత్వం మరియు సంస్కరణకు అవకాశాలు కలుగుతాయి. ఉదాహరణకు వివాహం, భర్తలు, పిల్లలు, పురుషులు మరియు మహిళలను వేర్వేరుగా ఉంచడానికి ఉన్న కారణాలు, పరదా (మర్యాద మరియు వేరుపాటు), బంధువుల పట్ల గౌరవం మొదలైన అంశాలపై చర్చించవచ్చు. ఇలాంటి చర్చల ద్వారా యువత ఎదుర్కొనే సమస్యలు మరియు సవాళ్లను బాగా అర్థం చేసుకుని, ఇస్లామీయ బోధనల ప్రకారం వారికి సరైన మార్గదర్శకత్వం ఇవ్వవచ్చు.

హుజూర్ గారు లజ్నా ఇమాయిల్లాహ్ జాతీయ అధ్యక్షురాలికి వివిధ వృత్తి రంగాలకు చెందిన విద్యావంతులైన యువ లజ్నా సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కమిటీ చర్చల్లో ఏ అంశాలను ప్రాధాన్యంగా తీసుకోవాలో నిర్ణయించి, వాటిని బాలికలతో ఎలా చర్చించాలో ప్రణాళికను రూపొందించాలని చెప్పారు.

విద్యా కార్యదర్శిని ఉద్దేశించి, లజ్నా అధ్యయనం కోసం ఏ పుస్తకాలను ఎంపిక చేశారని హుజూర్ గారు అడిగారు. కార్యదర్శి సమాధానంగా, హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) రచించిన "లెక్చర్ లూధియానా", ఖుర్ఆన్ తఫ్సీర్ (వ్యాఖ్యానం) మరియు నాజిరా ఖుర్ఆన్ (ఖుర్ఆన్ పఠనం) ఎంపిక చేసినట్లు తెలిపారు. హుజూర్ గారు ఈ కార్యక్రమాలకు మరియు లజ్నా సమావేశాలకు హాజరును పెంచాలని ఆదేశించారు.

ఆతిథ్య కార్యదర్శిని హుజూర్ గారు ప్రస్తుతం తయారవుతున్న భోజనం లజ్నా సభ్యులు విడిగా తయారు చేస్తున్నారా లేక జమాత్ ఆతిథ్య బృందం తయారు చేస్తున్నదా అని ప్రశ్నించారు. జమాత్ ఆతిథ్య బృందమే భోజనం సిద్ధం చేస్తున్నట్లు తెలియజేయబడింది.

ప్రచురణల కార్యదర్శి హుజూర్ గారికి, లజ్నా పత్రికలు "అజ్జుహా" మరియు "అల్-మీజాన్" ప్రచురితమవుతున్నాయని తెలిపారు. దీనిపై హుజూర్ గారు, లండన్‌లో వాఖిఫాత్-ఎ-నౌ కోసం ప్రచురించబడే "మర్యమ్" పత్రికకు కూడా సభ్యత్వం తీసుకోవాలని, దానిని క్రమం తప్పకుండా తెప్పించి సభ్యులలో విస్తృతంగా పంపిణీ చేయాలని సూచించారు. అదనంగా, లజ్నా వెబ్‌సైట్ నిర్వహణ మరియు వ్యవస్థీకరణ గురించి కూడా హుజూర్ గారు విచారించారు.

లజ్నా వెబ్‌సైట్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని, అలాగే బాలికలను దాని నిర్వహణలో భాగస్వామ్యం చేయాలని హుజూర్ గారు సూచించారు.

తబ్లీగ్ (ప్రచారం) కార్యదర్శిని ఉద్దేశించి, లజ్నా ప్రయత్నాల ద్వారా ఆ సంవత్సరంలో ఎన్ని బైఅత్‌లు జరిగాయని హుజూర్ గారు అడిగారు. స్థానిక మహిళల సాంస్కృతిక సంఘాలతో వ్యక్తిగత సంబంధాలను పెంపొందించుకోవాలని, దాని ద్వారా ప్రచారానికి కొత్త మార్గాలు తెరుచుకుంటాయని సూచించారు. అలాగే స్థానిక పాఠశాలలను సందర్శించి ప్రచార సంబంధాలను విస్తరించాలని ప్రోత్సహించారు. ఆ సంవత్సరానికి లజ్నా ఆస్ట్రేలియాకు ఐదు బైఅత్‌ల లక్ష్యాన్ని నిర్దేశించి, ఇంకా పెద్ద లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ప్రేరేపించారు. "పెద్ద లక్ష్యం పెట్టుకుంటే కనీసం నిర్దేశించిన లక్ష్యం అయినా సాధ్యమవుతుంది" అని అన్నారు.

కొత్తగా మతం స్వీకరించిన మహిళల శిక్షణ కార్యదర్శిని ఉద్దేశించి, ప్రస్తుతం తన పర్యవేక్షణలో ఎంత మంది మహిళలు ఉన్నారు, వారి సాంస్కృతిక నేపథ్యం ఏమిటి, వారు అహ్మదీయత్‌ను స్వీకరించడానికి ఏమి ప్రేరేపించింది? అని అడిగారు.

ప్రతి కొత్త సభ్యులు జమాత్ వ్యవస్థలో పూర్తిగా కలిసిపోవడం చాలా అవసరమని హుజూర్ గారు నొక్కి చెప్పారు. లేనిపక్షంలో వారు క్రమంగా దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

లజ్నా జాతీయ అధ్యక్షురాలు ఎంటిఏ మరియు రిష్తా నాతా (వివాహ సేవలు) విభాగాలను పర్యవేక్షించడానికి ఒక సహాయ అధ్యక్షురాలిని నియమించాలని హుజూర్ గారు ఆదేశించారు. అలాగే నాసిరాత్ (బాలికలు) కోసం ఒక వెబ్‌సైట్ రూపొందించవచ్చని, అయితే అది యుకే లజ్నా వెబ్‌సైట్ నమూనాను అనుసరించి, భద్రతాపరంగా ఆమోదించబడిన విధంగా ఉండాలని చెప్పారు.

ఆఫ్రికాలోని వివిధ దేశాలలో మోడల్ విలేజ్ ప్రాజెక్టులు ప్రారంభించబడ్డాయని, ప్రపంచంలోని ఇతర పెద్ద జమాత్‌లు నిధులు సమకూరుస్తున్నట్లే వీటికి కూడా ఆర్థిక సహాయం అందించాల్సిన అవసరం ఉందని హుజూర్ గారు పేర్కొన్నారు.

లజ్నా తమ ప్రదర్శన కార్యక్రమాల భాగంగా ఇతర స్థానిక సంస్థలు నిర్వహించే కార్యక్రమాలలో స్టాళ్లు ఏర్పాటు చేయవచ్చని కూడా హుజూర్ గారు అన్నారు.

లజ్నా తమ కార్యక్రమాలను నిర్వహించడంలో స్వేచ్ఛ కలిగి ఉందని, అహ్మదీయత్ సందేశాన్ని ప్రజలకు చేరవేయడానికి మరియు ప్రచార కార్యక్రమాలను నిర్వహించడానికి కొత్త మార్గాలను అన్వేషించాలని, అయితే ఇవన్నీ ఇస్లామీయ బోధనల పరిధిలోనే ఉండాలని హుజూర్ గారు సూచించారు.

లజ్నా ఇమాయిల్లాహ్ సభ్యులతో హుజూర్ గారి సమావేశం సాయంత్రం సుమారు 7:15 గంటలకు ముగిసింది.

**హసన్ మూసా లైబ్రరీ పరిశీలన:-**

తరువాత హుజూర్ గారు హసన్ మూసా లైబ్రరీని పరిశీలించారు.

2006లో ఆస్ట్రేలియా పర్యటన సందర్భంగా ఈ లైబ్రరీకి "హసన్ మూసా లైబ్రరీ" అనే పేరు పెట్టారు. ఈ పేరు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) సహచరుడైన హజ్రత్ సూఫీ హసన్ మూసా ఖాన్ (ర.అ.) గారి గౌరవార్థం ఇవ్వబడింది. 1903లో ఆస్ట్రేలియాలో అహ్మదీయా ముస్లిం సమాజ స్థాపన వారి (రజి) ప్రయత్నాల ద్వారానే ప్రారంభమైంది.

లైబ్రరీని పరిశీలిస్తూ, లైబ్రరీలోనే ఒక పుస్తక దుకాణం కూడా ఏర్పాటు చేయబడిందని హుజూర్ గారు గమనించారు. అయితే ఏ పుస్తకాలు అందుబాటులో ఉన్నాయో, ఏవి లేవో చాలా మందికి తెలియదని పేర్కొన్నారు. వాఖిఫాత్-ఎ-నౌ సభ్యులకు కూడా పుస్తకాల గురించి సరైన సమాచారం లేదని అన్నారు. అందువల్ల జమాత్ సభ్యులకు క్రమం తప్పకుండా సమాచారం ఇవ్వాలని, జుమా నమాజ్ సమయంలో ప్రకటనలు చేయాలని సూచించారు.

హుజూర్ గారు లైబ్రరీలోని వివిధ విభాగాలను, ముఖ్యంగా పిల్లల విభాగాన్ని కూడా పరిశీలించారు.

ఖాదియాన్ మరియు లండన్‌లో ప్రచురితమయ్యే అన్ని కొత్త పుస్తకాలను వీలైనంత త్వరగా లైబ్రరీ కోసం సేకరించాలని సాధారణ సూచన ఇచ్చారు.

లైబ్రరీ సందర్శకుల పుస్తకంలో హుజూర్ గారు ఇలా వ్రాశారు:

"అల్లాహ్ తఆలా జమాత్ సభ్యులకు ఈ లైబ్రరీ నుండి నిజమైన ప్రయోజనం పొందే భాగ్యాన్ని ప్రసాదించుగాకా! ముఖ్యంగా పవిత్ర ఖుర్ఆన్ విశ్లేషణలను మరియు హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) రచనలను అధ్యయనం చేసే అవకాశం వారికి కలుగజేయుగాకా!. ఆమీన్."

సందర్శన ముగింపులో, లైబ్రరీ నిర్వాహకులకు హుజూర్ గారితో కలిసి ఫోటో దిగే భాగ్యం లభించింది.

**వ్యక్తిగత మరియు కుటుంబ సమావేశాలు:-**

ఆ తర్వాత కార్యక్రమం ప్రకారం కుటుంబ సమావేశాలు ప్రారంభమయ్యాయి.

ఆ సాయంత్రం సమావేశంలో 16 కుటుంబాలకు చెందిన 40 మంది తమ ప్రియ ఖలీఫాను కలుసుకునే గౌరవాన్ని పొందారు. వీరిలో సిడ్నీలోని బ్లాక్‌టౌన్ మరియు మౌంట్ డ్రూట్ జమాత్‌ల సభ్యులతో పాటు, పర్త్ నుండి వచ్చిన ఒక సభ్యుడు కూడా ఉన్నారు. ఆ సభ్యుడు హుజూర్ గారిని కలవడానికి ఐదు గంటలకు పైగా విమాన ప్రయాణం చేసి సిడ్నీకి చేరుకున్నారు.

హాజరైన ప్రతి ఒక్కరికీ హుజూర్ గారితో కలిసి ఫోటోలు దిగే అవకాశం లభించింది. ప్రేమపూర్వకంగా హుజూర్ గారు విద్యార్థులకు పెన్నులు, చిన్న పిల్లలకు చాక్లెట్లు బహుమతిగా అందించారు.

ఈ సమావేశాలు రాత్రి సుమారు 8:45 గంటల వరకు కొనసాగాయి.

(అల్ ఫజల్ ఇంటర్నేషనల్ 13-19 డిసెంబర్ 2013.)

(తదుపరి సంచికలో)

Printed & Published by: Jameel Ahmed Nasir on behalf of Nigran Board of Badar. Name of Owner: Nigran Board of Badar. And printed at Fazle-Umar Printing Press. Harchowal Road, Qadian, Distt. Gurdaspur-143516, Punjab. And published at office of Weekly Badar Mohallah - Ahmadiyya, Qadian Distt. Gsp-143516, Punjab. India. Editor:Syed Rasool Niyaz